**WANTED**

అనతి కాలంలోనే అశేష ప్రజాదరణ పొందిన తెలంగాణ చౌరస్తా డిజిటల్ దినపత్రికకి సూర్యాపేట, హైదరాబాద్ జిల్లాల్లో నియోజకవర్గాల వారిగా రిపోర్టర్స్ కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రియార్టీ ఉంటుంది

సంప్రదించాల్సిన నెంబర్లు:
8328571871, 8897273714

epaper.tcnewsdaily.com
www.tcnewsdaily.com

# తెలంగాణ చౌరస్తా

Voice Of Democracy

సంపుటి: 01 సంచిక:185

24 క్యారెట్లు 150,457.00 | కిలో వెండి 2,20,547.00 | tcnewsdaily | 31.01.2026 శనివారం, హైదరాబాద్





2లో

# జనసంద్రంగా మేడారం

- వనదేవతలను దర్శించుకుని భక్తుల పారవశ్యం
- జై సమ్మక్క, జై సారలమ్మ నినాదాలు మార్మోగాయి
- నేడు సమ్మక్క- సారక్క అమ్మవార్లు వన ప్రవేశం
- వన ప్రవేశంతో మహాజాతర పరిమాసప్తం
- సతీసమేతంగా వనదేవతలను దర్శించుకున్న గవర్నర్
- మేడారంలో మొక్కులు చెల్లించుకున్న డీజీపీ శివధర్‌రెడ్డి
- భద్రత ఏర్పాట్లపై నిశితంగా పరిశీలన
- అమ్మవారిని దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ

మేడారంలో కొలువుదీరిన వనదేవతలను దర్శించుకునేందుకు భక్తజనం లక్షలాదిగా తరలివస్తూనే ఉన్నారు. నిండు జాతరలో తల్లులను చూసి తన్మయత్వం పొందుతున్నారు. కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పునకు నిలువెత్తు బంగారం సమర్పించి సంతోషంగా మొక్కులు చెల్లించుకుంటున్నారు. శనివారం సమ్మక్క- సారక్క అమ్మవార్లు వన ప్రవేశంతో మేడారం జాతర పరిమాసప్తం కానుంది. సామాన్య భక్తులతో పాటు పలువురు ప్రముఖులు ఆదివాసీల ఇష్టదైవాన్ని నిండు మనసుతో కొలిచారు.



# కామన్ స్కూల్ విధానంతో సమన్యాయం

- ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం
- కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్స్ కు దీటుగా సౌకర్యాలు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- మొగిలిగిద్ద పాఠశాల 150వ వార్షికోత్సవ వేడుకలు
- పాల్గొన్న మంత్రి పొన్నం, ఎమ్మెల్యే శంకర్, ప్రొఫెసర్ హరగోపాల్

2లో

## గోదావరి-నల్లమలసాగర్
# ప్రాజెక్టును అంగీకరించం

- గోదావరి నీటిని ఆంధ్రప్రదేశ్ ఏ రూపంలో మల్లించినా ఊరుకోం
- జల వివాదాలపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం
- బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ నీటి పారుదల రంగం విధ్వంసం
- పదేండ్లలో నీటి పారుదల శాఖకు రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు
- షార్ట్ టర్మ్ లోన్లు తెచ్చి కట్టిన కాళేశ్వరం కూలిపోయింది
- కేంద్రంపై ఒత్తిడితో పాటు న్యాయ పోరాటం చేస్తాం
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

గోదావరినల్లమలసాగర్ ప్రాజెక్టును అంగీకరించేది లేదని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం జూమ్ మీటింగ్ ద్వారా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరి నీటిని ఆంధ్రప్రదేశ్ ఏ రూపంలో మల్లించినా అంగీకరించే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నదీ జల వివాదాల పరిష్కారానికి కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేసిన కమిటీ తొలి సమావేశంలో గోదావరినల్లమలసాగర్‌ను

।మిగతా 2 లో।



# క్షమించండి... నోరు జారాను

- సీపీ గౌస్ ఆలంపైకి కౌశిక్‌రెడ్డి క్షమాపణలు
- వీణవంక జాతర సాక్షిగా చెలరేగిన ఆధిపత్య పోరు
- కరీంనగర్ సీపీపై మతపరమైన దూషణలు
- ఆగ్రహించిన ఐపీఎస్ అధికారుల సంఘం
- చివరకు సోషల్ మీడియా వేదికగా హుజురాబాద్ ఎమ్మెల్యే వివరణ

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

సంచలన ప్రకటనలతో వార్తల్లో నిలిచే హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఈసారి ఏకంగా పోలీస్ బాసులనే టార్గెట్ చేసి చిక్కుల్లో పడ్డారు. వీణవంక జాతర నిర్వహణ విషయంలో స్థానిక ఆధిపత్య పోరులో భాగంగా మొదలైన గొడవ కరీంనగర్ సీపీ గౌస్ ఆలంపై వ్యక్తిగత, మతపరమైన దూషణల వరకు వెళ్లింది. దీంతో ఆ ఎమ్మెల్యే తీవ్ర

।మిగతా 2 లో।

# లీడర్...రేవంత్ రెడ్డి

- హార్వర్డ్ వర్సిటీలో లీడర్‌షిప్ కోర్సు పూర్తిచేసిన సీఎం
- తొలి సీఎంగా రేవంత్ రెడ్డి నయా రికార్డు
- జనవరి 25 నుంచి 30 వరకు హార్వర్డ్ లో
- లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ' పేరిట తరగతులు
- తరగతులకు ప్రత్యక్షంగా సీఎం రేవంత్ రెడ్డి హాజరు
- ఎసైన్‌మెంట్లు, హోంవర్క్‌లు, గ్రూప్ డిస్కషన్‌లతో కోర్సు పూర్తి
- అనంతరం హార్వర్డ్ ప్రొఫెసర్లు సర్టిఫికెట్ అందుకున్నారు



2లో

# కేసీఆర్ కు సిట్ రెండో నోటీస్

- ఫిబ్రవరి ఒకటిన నందినగర్ ఇంట్లో విచారణకు హాజరుకండి
- ఇంటి గోడకు నోటీసు అంటించిన సిట్
- ఎర్రబెల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి రావడం సాధ్యపడదు
- తక్షణం 160 ప్రకారం కేసీఆర్‌కు నోటీసు ఇవ్వడం చెల్లదు
- తాజా పరిణామాలపై ఎర్రబెల్లిలోని ఫామ్‌హౌజ్‌లో సమావేశం



2లో

# లీడర్...రేవంత్ రెడ్డి

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలోని 'కెనెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్'లో లీడర్‌షిప్ కోర్సును విజయవంతంగా పూర్తి చేశారు. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ నుంచి కోర్సు సర్టిఫికెట్ను అందుకున్నారు. జనవరి 25 నుంచి 30 వరకు 'లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ' పేరిట నిర్వహించిన తరగతులకు ఆయన హాజరయ్యారు. ఈ విషయాన్ని రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పంచుకున్నారు. 20 దేశాల నుంచి వచ్చిన 60 మంది విద్యార్థులతో కలిసి తరగతులకు హాజరైనట్లు టీచర్స్, తోటి విద్యార్థుల నుంచి ఎంతో నేర్చున్నట్లుగా ఆయన పేర్కొన్నారు.

ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయం తన సోషల్ మీడియా ఎక్స్ లో ఓ పోస్టు చేసింది. హార్వర్డ్ కెన్నడీ స్కూల్లో జరిగిన 21వ శతాబ్దంలో నాయకత్వం అనే ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు 62 మంది పాల్గొన్న వారు కోర్సును విజయవంతంగా పూర్తి చేయడంతో ముగిసిందని పేర్కొంది. ఈ కోర్సులో భాగంగా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రతిరోజూ పలు సెషన్లతో కూడిన విస్తృత విద్యా కార్యకలాపాలు జరగాయని తెలిపింది. ఈ కోర్సులో నిర్మాణాత్మక చర్చలు, బృంద చర్చల ద్వారా లీడర్షిప్, పరిపాలన, అధికారం పరిపాలన అంశాలపై చర్చ జరిగిందని పేర్కొంది. కోర్సు పూర్తయిన అనంతరం పాల్గొన్న వారికి హార్వర్డ్ ప్రొఫెసర్లు సర్టిఫికెట్లను ప్రదానం చేశారని తన పోస్టులో పేర్కొంది. హార్వర్డ్ విశ్వవిద్యాలయ సందర్శన సందర్భంగా అక్కడ చదువుతున్న విద్యార్థులతో రేవంత్ రెడ్డి ముచ్చటించారని తెలిపింది.

సీఎం రేవంత్ రెడ్డి దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొన్న అనంతరం ఈ నెల 24వ తేదీన అక్కడి నుంచి బయలుదేరి అమెరికా వెళ్లారు. యూఎస్‌లోని మసాచుసెట్స్ రాష్ట్రం కేంబ్రిడ్జ్ నగరంలో ఉన్న హార్వర్డ్ కెనెడీ స్కూల్‌లో రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా తరగతులకు హాజరయ్యారు. పలు ఎసైన్‌మెంట్లు పూర్తి చేసి, హోంవర్క్‌లు సమర్పించి, గ్రూప్ డిస్కషన్‌లు, ప్రాజెక్టుల్లో ఆయన భాగస్వామ్యమయ్యారు. ఈ కార్యక్రమంలో 20 దేశాలకు చెందిన నాయకులు, విధాన నిర్ణేతలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా వివిధ దేశాలు, కాలాలు, చరిత్రలోని కీలక సంఘటనలపై ఆధారపడిన కేస్ స్టడీస్‌ను విశ్లేషిస్తూ వాటికి పరిష్కారాలను రూపొందించి తరగతుల్లో విద్యార్థులు ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం రేవంత్‌రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి అధికారిక సర్టిఫికెట్ను అందుకున్నారు. 'పదవిలో ఉన్న భారతదేశానికి చెందిన ముఖ్యమంత్రుల్లో హార్వర్డ్ నుంచి నాయకత్వ కోర్సులో సర్టిఫికెట్ పొందిన తొలి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి నిలిచారని' ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. అమెరికాలోని హార్వర్డ్ బిజినెస్ స్కూల్ (హెచ్‌బీఎస్)లో చదువుతున్న ఇండియన్ విద్యార్థులతో రేవంత్‌రెడ్డి గురువారం సమావేశమయ్యారు. ఆ విశ్వవిద్యాలయానికి చెందిన కెనెడీ స్కూల్‌లో ప్రత్యేక కోర్సులో శిక్షణ పొందేందుకు వెళ్లిన ఆయనను హెచ్‌బీఎస్‌లో చదువుతున్న భారతీయ విద్యార్థుల బృందం ఆహ్వానించింది. తన తరగతులు, ఎసైన్‌మెంట్లు పూర్తయిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులను కలిసి ముచ్చటించారు. ఏ రాష్ట్రం నుంచి వచ్చారు? ఏయే కోర్సులు చదువుతున్నారు? ఈ విశ్వవిద్యాలయన్నే ఎందుకు ఎంచుకున్నారు? ఇక్కడ కెరీర్ మార్గాలు, ఎదురవుతున్న సవాళ్లను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు వృత్తిపరమైన సమస్యలతో పాటు తన విజయానికి సోపానాలను రేవంత్ రెడ్డి వారికి వివరించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాన్ని, ముఖ్యాంశాలను విద్యార్థులతో పంచుకున్నారు. తమ పరిచయాలు, ప్రతిభను ఉపయోగించి దేశాభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు. హైదరాబాద్, తెలంగాణలో అవకాశాలను, వనరులను సద్వినియోగం చేసుకోవడానికి బ్రాండ్ అంబాసిడర్లుగా పని చేయాలని రేవంత్ రెడ్డి వారిని కోరారు.

# కామన్ స్కూల్ విధానంతో సమన్యాయం

- విధానంతోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఏర్పాటు చేస్తున్నాం
- ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం
- కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్స్ కు దీటుగా సౌకర్యాలు
- మొగిలిగిద్ద పాఠశాల 150వ వార్షికోత్సవ వేడుకలు
- పాల్గొన్న మంత్రి పొన్నం, ఎమ్మెల్యే శంకర్, ప్రొఫెసర్ హరగోపాల్
- పేదల కోసం పరితపించిన వ్యక్తి మాజీ సీఎం బూర్గుల రామకృష్ణారావు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

కామన్ స్కూల్ విధానంతో అన్ని వర్గాలకూ సమన్యాయం జరుగుతుందని, ఈ విధానంతోనే రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నెలకొల్పుతున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో 25 ఎకరాల స్థలంలో ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా వీటిని ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి డిప్యూటీ సీఎం భట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల, మత తేడాలు లేకుండా చిన్నతనం నుంచే విద్యార్థుల్లో అందరం ఒక్కటే అనే భావాన్ని కల్పించేందుకే ఈ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు ఏర్పాటు చేస్తుందని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద కొడంగల్ నియోజకవర్గంలో అందిస్తున్నామని తెలిపారు. మొగిలిగిద్ద పాఠశాలలో చదువుకున్న రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు దేశానికి దిశా నిర్దేశం చేసే స్థాయికి ఎదిగారని, అలాగే ఈ పాఠశాలలో ఎంతో మంది చదువుకుని ప్రయోజకులయ్యారని తెలిపారు. భూమిపై రైతులకు హక్కులను కల్పించిన మహోన్నత వ్యక్తి బూర్గుల అని అన్నారు. 2008లో రాష్ట్రవ్యాప్తంగా ఆంగ్ల విద్యా విధానాన్ని దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రూ.27 వేల కోట్లు వడ్డీ లేని రుణాలు ఇచ్చామని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. చరిత్ర ఎప్పుడు కూడా భవిష్యత్తుకు కొలమానమని, ప్రజలు చరిత్రను ఎప్పుడూ మరువకూడదని అన్నారు. ఈ గ్రామానికి తుర్రేబాజ్ ఖాన్ లాంటి పోరాటయోధుల చరిత్ర ఉందన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. ఏ దేశమైతే విద్యకు ప్రాధాన్యత ఇస్తుందో ఆ దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. వందేండ్ల వార్షికోత్సవానికి ఎస్ఆర్ శంకరన్ వచ్చి ప్రభుత్వ కళాశాలను ప్రారంభించారని గుర్తుచేశారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తే ఈ ప్రాంతంలో వలసలు ఆగడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి, డీఈఓ సుశీందర్రావు, గ్రామ సర్పంచ్ ఏశామోని కృష్ణయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ బండారు సంతోష, ఆర్డీఓ ఆర్ఎన్ సరిత, డీసీపీ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి-నల్లమలసాగర్
# ప్రాజెక్టును అంగీకరించం

**తరువాయి భాగం**

చేర్చొద్దని ప్రతిపాదించామని అన్నారు. ఈ ప్రాజెక్ట్ డీపీఆర్‌కు అనుమతి ఇవ్వలేదనీ, సంబంధిత పొరుగు రాష్ట్రాల అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాతే ముందుకు పోతామని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్.పాటిల్ గురువారం లేఖ రాశారని అన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ నీటి పారుదల రంగాన్ని విధ్వంసం చేశారని విమర్శించారు. పదేండ్లలో నీటి పారుదల శాఖకు రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేశారనీ, అందులో ఒక్క కాళేశ్వరం ప్రాజెక్ట్‌కే రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి, మిగతా మొత్తాన్ని రాష్ట్రంలోని ఇతర ప్రాజెక్ట్‌లకు వ్యయం చేశారని విమర్శించారు. పాలమూరుకు రూ.21,500 కోట్లు, సీతారామ ప్రాజెక్ట్‌కు రూ.8 వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరానికి కూడా నీరందించలేదని ఆరోపించారు. షార్ట్ టర్మ్ లోన్లు తెచ్చి కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని ఎద్దేవా చేశారు పాలమూరురంగారెడ్డి, కోయిల సాగర్, నెట్టెంపాడు, భీమా డిండీ, ఎస్ఎల్‌బీసీ మొదలగు ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లా ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కృష్ణా నీటి వాటాల విషయంలో బీఆర్ఎస్ పదేండ్ల కాలంలో చేసిన తప్పుడు ఒప్పందాలే తెలంగాణకు మరణశాసనమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. 34 శాతం (299 టీఎంసీలు) తెలంగాణకు, 66శాతం (515 టీఎంసీలు) ఏపీకి కేటాయించడాన్ని రెండు అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లతో పాటు కేఆర్ఎంబీ బోర్డు మీటింగుల్లో బీఆర్ఎస్ సర్కార్ ఒప్పుకుందని ఆరోపించారు. కృష్ణా నీటి వాటాలో 70 శాతం తెలంగాణకు, 30శాతం ఏపీకి ఇవ్వాలని పోరాడుతున్నామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు పేరు మార్చుకుని గోబెల్స్ అని పెట్టుకోవాలని సూచించారు.





# ఇస్నాపూర్ మున్సిపాలిటీ 4వ వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థిగా నీలం కవిత మధు నామినేషన్

- నామినేషన్ పత్రాలతో దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్ పరిధిలోని నాలుగో వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థిగా శుక్రవారం నీలం మధు సతీమణి నీలం కవిత నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు చిట్కుల్ దుర్గామాత ఆలయంలో నామినేషన్ పత్రాలు అమ్మ వారి దగ్గర ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నాలుగో వార్డ్ మహిళలు పెద్దఎత్తున నీలం మధు నివాసానికి చేరుకుని కవితను గెలిపించుకుంటామని భరోసా ఇచ్చారు. నీలం మధు చేతుల మీదుగా నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఇస్నాపూర్ ఐలా భవనంలోని నామినేషన్ స్వీకరణ కేంద్రంలో కవిత మధు తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ శ్రేణులు, మహిళలు, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.






# జనసంద్రంగా మేడారం

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

మేడారంలో కొలువుదీరిన వనదేవతలను దర్శించుకునేందుకు భక్తజనం లక్షలాదిగా తరలివస్తూనే ఉన్నారు. నిండు జాతరలో తల్లులను చూసి తన్మయత్వం పొందుతున్నారు. కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పునకు నిలువెత్తు బంగారం సమర్పించి సంతోషంగా మొక్కులు చెల్లించుకుంటున్నారు. శనివారం సమ్మక్క సారక్క అమ్మవార్లు వన ప్రవేశంతో మేడారం జాతర పరిమాసప్తం కానుంది. సామాన్య భక్తులతో పాటు పలువురు ప్రముఖులు ఆదివాసీల ఇష్టదైవాన్ని నిండు మనసుతో కొలిచారు.ః కాకతీయులపై కత్తి దూసిన వీరనారీమణులు సమ్మక్కసారలమ్మ రెండేళ్ల తరువాత వనం వీడి జనం చెంతకు విచ్చేశారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు ఇలా వనదేవతలంతా గద్దెలపైనే కొలువుదీరడంతో భక్తుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అమ్మవార్లను దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగిపోతున్నారు. జై సమ్మక్క, జై సారలమ్మ నినాదాలు నిండుజాతరలో మార్మోగాయి జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి నిలువెత్తు బంగారం సమర్పించుకుని మళ్లీ రెండేళ్లకు తిరిగివస్తామంటూ సంతోషంతో తిరుగు పయనమయ్యారు.

మేడారంలో గద్దెలపై వేంచేసిన వనదేవతలను సతీ సమేతంగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర ప్రథమ పౌరుడికి పోలీసులు, ఇతర శాఖల అధికారులు ఘనస్వాగతం పలికారు. మంత్రి సీతక్క వనదేవతల విశిష్ఠతను గవర్నర్ దంపతులకు దగ్గరుండి వివరించారు. క్తులకు పసుపు బొట్టు పెట్టిన సురేఖ : దేవాదాశాఖ మంత్రి కొండా సురేఖ అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం లైన్‌లో ఉన్న భక్తులకు పసుపుబొట్టు పెట్టి ఆకర్షణగా నిలిచారు. మేడారానికి వచ్చే సామాన్య భక్తులకు ఎలాంటి లోటు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు మంత్రి సురేఖ మీడియాతో మాట్లాడుతూ వివరించారు. సియాలో అతిపెద్ద గిరిజన జాతరలో ఎలాంటి భద్రతాపరమైన లోపాలు లేకుండా చర్యలు తీసుకున్నట్లు డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నారు. మేడారంలో మొక్కులు చెల్లించుకున్న డీజీపీ అక్కడ విధుల్లో ఉన్న అధికారులతో కలిసి జన జాతరలో భద్రతా ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. తల్లులను దర్శించుకున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పించారు. వనదేవతలను దర్శించుకున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. మేడారం తిరుగు ప్రయాణంలో భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మేడారం నుంచి తాడ్వాయి వరకు రాకపోకలు స్తంభించాయి. వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికుల తీవ్ర అవస్థలు పడుతున్నారు. గురువారం నాడు నిండు జాతర ఆవిష్కృతమైంది. తల్లి గద్దెపైకి చేరడంతో ఆధ్యాత్మిక శోభ ఊహించని రీతిలో ఉట్టిపడింది. జంపన్నవాగులో పవిత్ర స్నానాలకు పోటెత్తిన వారు ఒకవైపు అమ్మవార్ల దర్శనం కోసం కిటకిటలాడే క్యూలైన్లలో మరో వైపు ఎటు చూసినా భక్తజనమే కనిపించారు. మేడారం ప్రాంతంలోని అన్ని రోడ్లు జనంతో నిండిపోగా రద్దీ నియంత్రణకు పోలీసుశాఖ ఇతర అధికారులు తీవ్రంగా శ్రమించారు. లక్షలాదిగా భక్తులు తరలిరావటంతో వారందరికీ ఆ తల్లి సమ్మక్క దర్శన సౌకర్యం కల్పించే క్రమంలో అధికారులు ప్రణాళికలు అమలు చేశారు. బుధవారం సుమారు 20 లక్షల మంది రాగా గురువారం ఇంతకు రెండింతల జనం సమ్మక్క దర్శనానికి వచ్చారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో సారలమ్మ గద్దెలపైకి వచ్చే సందర్భంలో కొంతసేపు దర్శనాలు నిలిపివేయటం మినహా ఎక్కడా మరే ఇతరత్రా ఇబ్బంది కలుగలేదు. ఈరోజు ఉదయం నుంచే భక్తులు వేగంగానే అమ్మవార్లను దర్శించుకున్నారు. క్యూలైన్ల నుంచి గద్దెల ప్రాంగణంలోకి చేరాక కేవలం పది నిమిషాల్లోనే చకచకా దర్శనం పూర్తవుతుంది. సాధారణ భక్తులకు క్యూలైన్లలో గంటన్నర సమయం పట్టగా వీఐపీ, వీవీఐపీ భక్తులకు 15 నిమిషాల్లోనే దర్శనం సౌకర్యంగా ఉంది. జాతరలో ప్రధాన ఘట్టమైన సమ్మక్క గద్దె మీదకు రావటంతో శుక్రవారం భారీగా రద్దీ పెరిగింది.




# కేసీఆర్ కు సిట్ రెండో నోటీస్

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) కు సిట్ రెండోసారి నోటీస్ జారీ చేసింది. ఫిబ్రవరి ఒకటో తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు నందినగర్‌లో మీ నివాసంలో విచారిస్తామనీ, అందుబాటులో ఉండాలని స్పష్టంగా పేర్కొంది. శుక్రవారం రాత్రి తొమ్మిదిన్నర గంటల ప్రాంతంలో హైదరాబాద్‌లోని నందినగర్‌లో గల కేసీఆర్ నివాసానికి నోటీసు ఇవ్వడానికి సిట్ అధికారులు వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉంది. అక్కడ సెక్యూరిటీ గార్డులు మాత్రమే ఉన్నారు. దాంతో సిట్ అధికారులు తాము తీసుకొచ్చిన నోటీసును అక్కడ గోడకు అంటించారు. అక్కడకు వచ్చిన మీడియా ప్రతినిధులతో మాట్లాడటానికి సిట్ అధికారులు నిరాకరించారు. తాము 160 సెక్షన్ ప్రకారం నోటీసు ఇస్తున్నామనీ, ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి విచారించాల్సి ఉందని అందులో సిట్ పేర్కొంది.

మీరు కోరినట్టు ఎర్రబెల్లిలో ఉంటున్న వ్యవసాయ క్షేత్రానికి రావడం సాధ్యపడదనీ, విచారణ కోసం తాము వినియోగిస్తున్న సున్నితమైన రికార్డింగ్ పరికరాలు, సాంకేతికతను అక్కడకు తీసుకురావడం సాధ్యపడదని స్పష్టం చేసింది. అధికారిక రికార్డుల ప్రకారం మీ నివాస స్థలం చిరునామాగా నందినగర్‌లోని ఇంటి పేరే ఉందని పేర్కొంది. నందినగర్‌లోని నివాసంలోనే కేసీఆర్‌ను విచారించాలని సిట్ స్పష్టమైన నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. కాగా, గురువారం ఇచ్చిన నోటీసుకు కేసీఆర్ స్పందిస్తూ...తనను ఎర్రబెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలోనే విచారించాలనీ, భవిష్యత్తులో ఇచ్చే ఏ నోటీసులనైనా ఆ చిరునామాకే పంపించాలని సిట్‌కు రాసిన లేఖలో కోరిన విషయం విదితమే. 65 ఏండ్లు పైబడిన వారిని వారు



ఉంటున్న ప్రదేశానికే వచ్చి విచారించాలని గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను కూడా కేసీఆర్ ప్రస్తావించిన సంగతి తెలిసిందే. తాజాగా కేసీఆర్‌కు నోటీసులిచ్చే ముందు సీపీ సజ్జనార్ నేతృత్వంలోని సిట్ అధికారుల బృందం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమావేశమైంది. నోటీసు అంశంపై సుధీర్ఘంగా చర్చించింది. కేసీఆర్ లేవనెత్తిన కొన్ని అంశాలను న్యాయ నిపుణులతో చర్చించి నందినగర్‌లోని నివాసంలోనే విచారణ సాగించాలని తుది నిర్ణయం తీసుకున్నది. ఇదిలా ఉంటే సిట్ ఇచ్చిన నోటీసుపై కేసీఆర్ తరుపు న్యాయవాదులు స్పందిస్తూ..తక్షణం 160 ప్రకారం కేసీఆర్‌కు నోటీసు ఇవ్వడం చెల్లదనీ, ముఖ్యంగా 65 ఏండ్లు పైబడిన వారు ఎక్కడ ఉంటే అక్కడకే వెళ్లి విచారించాలనే సుప్రీం ఆదేశాలున్నాయని వాదించారు. మరోవైపు, తాజా పరిణామాలపై ఎర్రబెల్లిలోని ఫామ్‌హౌజ్‌లో బీఆర్ఎస్ అగ్రనాయకులు హరీశ్‌రావు, జగదీశర్వర్‌రెడ్డితో పాటు మరికొందరు న్యాయనిపుణులతో కేసీఆర్ సమావేశమైనట్టు తెలిసింది. నందినగర్‌లో విచారణకు హాజరు కావాలంటూ సిట్ తన నోటీసులో ఆదేశించడంపై న్యాయపరంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంపై నిపుణులతో ఆయన సమాలోచనలు జరిపినట్టు విశ్వసనీయ సమాచారం.

# క్షమించండి... నోరు జారాను

**తరువాయి భాగం**

విమర్శలపాలు కాగా.. మరోవైపు ఐపీఎస్ అధికారుల సంఘం గట్టిగా స్పందించడం, కేసులు నమోదు కావడంతో ఎట్టకేలకు ఆయన సోషల్ మీడియా వేదికగా క్షమాపణలు చెప్పారు. 'అది ఉద్దేశపూర్వకంగా అన్న మాటలు కావు' అంటూ కౌశిక్‌రెడ్డి వివరణ ఇచ్చుకున్నారు.

**సీపీపై ఎమ్మెల్యే దూషణ**

జాతరలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు కౌశిక్‌రెడ్డి రాకను అడ్డుకోవడంతో వివాదం ముదిరింది. పోలీసుల తీరుపై ఆగ్రహించిన ఎమ్మెల్యే, హుజూరాబాద్‌లో రోడ్డుపై బైటాయించి ధర్నాకు దిగారు. ఈ క్రమంలో కరీంనగర్ సీపీ గౌస్ ఆలంను ఉద్దేశించి దూషించడమే కాకుండా, మతపరమైన అంశాలను కూడా ప్రస్తావిస్తూ దుర్భాషలాడినట్టు మీడియాలో వచ్చింది. విధుల్లో ఉన్న ఏసీపీ, సీఐలపై కూడా ఆయన దురుసుగా ప్రవర్తించడంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని సైదాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో గురువారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఎమ్మెల్యేను విడుదల చేసినప్పటికీ, ఆయనపై పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. కౌశిక్‌రెడ్డిపై భారత న్యాయ సంహిత కింద కఠినమైన సెక్షన్లను నమోదు చేశారు. 295ఏ, 196 (మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టడం), 353 (ప్రభుత్వ ఉద్యోగి విధులకు అడ్డు తగలడం)ఇతర సెక్షన్లు 341, 140 3ఏ, 506, 126 (2), 132, 299 వంటి సెక్షన్ల కింద హుజూరాబాద్ పోలీసులు కేసులు ఫైల్ చేశారు.

**ఐపీఎస్ అధికారుల సంఘం ఆగ్రహం**

కరీంనగర్ సీపీ గౌస్ ఆలంపై ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఐపీఎస్, ఐఏఎస్ అధికారుల సంఘాలు అత్యంత తీవ్రంగా పరిగణించాయి. ఒక ప్రజా ప్రతినిధి అయి ఉండి, విధుల్లో ఉన్న అధికారిపై మతం పేరుతో దూషణలు చేయడం గర్హనీయమని ఆగ్రహం వ్యక్తం చేశాయి. కౌశిక్‌రెడ్డి తక్షణమే బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో చట్టపరమైన పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించాయి. ఈ మేరకు తెలంగాణ ఐఏఎస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.రామకృష్ణారావు, జయేష్‌రంజన్ శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.

ప్రభుత్వ అధికారుల నుంచి తీవ్ర ఒత్తిడి పెరగడంతో ఎట్టకేలకు కౌశిక్‌రెడ్డి ఒక వీడియో సందేశం ద్వారా తన వ్యాఖ్యలకు చింతిస్తున్నట్టు ప్రకటించారు. 'పోలీసులంటే నాకు గౌరవం ఉంది. నాపై ప్రభుత్వం రాజకీయ కక్ష సాధిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం ఇక్కడి పోలీసులు నాకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. నా సొంత ఊర్లో జాతరకు వెళ్లకుండా అడ్డుకోవడంతో కలిగిన తీవ్ర ఒత్తిడిలోనే ఆ మాటలు అన్నాను తప్ప ఉద్దేశపూర్వకంగా కాదు. ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే క్షమించండి' అంటూ కోరారు. ప్రస్తుతానికి క్షమాపణతో ఈ ఎపిసోడ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టాలని కౌశిక్‌రెడ్డి భావిస్తున్నప్పటికీ, ఆయనపై నమోదైన కేసులు, ఐపీఎస్ సంఘం ఆగ్రహం అంత సులభంగా సమసిపోయేలా లేవు.

**వివాదానికి బీజం పడిందిలా**

వీణవంక మండల కేంద్రంలో జరిగే సమ్మక్కసారలక్క జాతర నిర్వహణపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి, ఆయన ప్రత్యర్థి పాడి ఉదయానంద రెడ్డి కుటుంబానికి మధ్య కొంతకాలంగా 'వార్' నడుస్తోంది. గతంలో ఈ జాతరను ప్రభుత్వమే నిర్వహించాలని కౌశిక్‌రెడ్డి కోర్టుకెళ్లారు. అయితే, ఆ స్థలం తమదని ఉదయానందరెడ్డి హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు వారి పక్షాన తీర్పునిచ్చింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు కౌశిక్‌రెడ్డిని జాతరకు రాకుండా అడ్డుకున్నారు. ఇదే వివాదానికి కారణమైందనేది స్థానికులు చెప్పిన అభిప్రాయం.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యం

- సి.ఎస్.ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాల ఆధునీకరణకు నూతన ఊపిరి.
- మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ప్రారంభించిన ఎంపీ ఈటల రాజేందర్

**కూకట్ పల్లి,తెలంగాణ చౌరస్తా:**




ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం సమాజానికి శుభపరిణామమని మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. ప్రభాకర్ రెడ్డి నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని సేల్స్‌ఫోర్స్ సంస్థ సి.ఎస్.ఆర్ నిధులతో పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేసి ఆధునికరించిన నూతన భవనాన్ని ఎంపీ ఈటల రాజేందర్ బూరుగుపల్లి రామ్మోహన్ ఆధ్వర్యంలో అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంపీ మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు అందినప్పుడే నాణ్యమైన విద్య సాధ్యమవుతుందని తెలిపారు. సి.ఎస్.ఆర్ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలు బలపడితే భవిష్యత్ తరాలకు బలమైన పునాది పడుతుందని పేర్కొన్నారు.కార్పొరేట్ సంస్థలు విద్య రంగంలో భాగస్వాములవ్వడం అభినందనీయమని కొనియాడారు.అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర రావు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సేల్స్‌ఫోర్స్ సంస్థ చేయూతనివ్వడం నిజమైన సామాజిక బాధ్యతకు నిదర్శనమని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ఆధునిక సౌకర్యాలు కల్పించడమే సమాజ పురోగతికి మార్గమని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# సీఎంఆర్‌ఎఫ్‌తో గంగాధర్ కుటుంబానికి ఆర్థిక ఊరట

- 1.60 లక్షల రూపాయల సహాయం అందజేత

**కూకట్ పల్లి,తెలంగాణ చౌరస్తా:**

సీఎంఆర్ఎఫ్ వంటి ప్రభుత్వ పథకాలు పేద కుటుంబాలకు ఆశాకిరణంగా నిలుస్తున్నాయని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని కూకట్ పల్లి డివిజన్‌కు చెందిన గంగాధర్ పక్షవాతం సమస్యతో రాందేవ్ రావు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిలో ముఖ్యమంత్రి సహాయనిధి ఆయన కుటుంబానికి పెద్ద ఆధారంగా నిలిచింది. విషయం తెలుసుకున్న కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ చొరవతో సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయించారు. దీంతో ప్రభుత్వం నుంచి రూ.1,60,000 సహాయం మంజూరయ్యాయి. మంజూరైన సీఎంఆర్ఎఫ్ లెటర్‌ను శుక్రవారం కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బండి రమేష్ గంగాధర్ కుమారుడు భారత్‌కు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, వెంకటేష్, సలీం, అబ్దుల్లా, సాయి తులసి, బాలరాజు, రవి, మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగాధర్ కుటుంబ సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.




# కార్మిక రంగాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్రం నిర్ణయాలు

- 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి
- ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు ఆలకుంట్ల సాయిలు

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**

కార్మిక రంగాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు ఆలకుంట్ల సాయిలు అన్నారు.ఫిబ్రవరి 12న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలో ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలకుంట్ల సాయిలు మాట్లాడుతూ.... మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్ లు తెచ్చి కార్మిక వర్గ హక్కుల్ని కాలరాస్తుందన్నారు.బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి కార్మిక వర్గాన్ని పెట్టుబడుదారులు దోపిడీ చేసుకోవడానికి అవకాశం ఇచ్చిందని విమర్శించారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని విబిజి రామ్ జీ గా మార్చి పేదల పొట్ట కొట్టడానికి ప్రభుత్వం సిద్ధమైందని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యుత్ సవరణ చట్టం 2025 ప్రకారం భవిష్యత్తులో విద్యుత్ రంగం ప్రైవేటుపరమై సబ్సిడీలు పోతాయని ప్రజలపై రైతులపై మరింత భారం పెరగనుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, దేశంలో సహజ వనరులన్నీ బడా కార్పొరేట్ పెట్టుబడుదారులకు అప్పనంగా అప్పజెప్తోందని అన్నారు.కార్మికులు, రైతులు, అన్ని వర్గాలను ఇబ్బందులకు గురి చేస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఫిబ్రవరి 12న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు గుద్దే అశోక్, కళ్యాణి సంపత్, శ్రీను, ప్రసాద్, మహేష్, తేజావత్ రమేష్, గుగులోతు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పాలి

- ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

మున్సిపాలిటీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, 10 యేండ్లు ప్రజల సొమ్మును దోచుకున్న బీఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని గుమ్మడిదల, ఇస్నాపూర్, ఇంద్రేశం, జిన్నారం, గడ్డపోతారం మున్సిపాలిటీల్లో బీజేపీ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, బీజేపీకి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే నిధులతోనే మునిపాలిటీల అభివృద్ధి జరుగుతుందన్నారు. కాంగ్రెస్ రెండేళ్లు మునిపాలిటీల్లో పైస పని కాలేదన్నారు. జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్సీ తాను ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, బీజేపీ నేతలు శివారెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, మున్సిపాలిటీ ఇంచార్జిలు, తదితరులు పాల్గొన్నారు.



# తొర్రూరు మున్సిపాలిటీ పై కాషాయ జెండా ఎగురవేస్తాం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాంమోహన్ రెడ్డి

**తొర్రూర్-తెలంగాణ చౌరస్తా:**

తొర్రూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను అధిక సంఖ్యలో గెలిపించి తొర్రూరు మున్సిపాలిటీ పై కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి ధీమా వ్యక్తంచేశారు.తొర్రూరు పట్టణంలో స్థానిక పెట్రోల్ బంక్ సెంటర్ నుంచి మున్సిపాలిటీ వరకు బీజేపీ అభ్యర్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ప్రపంచంలోని అగ్ర దేశాల సరసన నిలిచింది అని , తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధి పై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు సవతి తల్లి ప్రేమను చూపెట్టాయని ఈరెండు పార్టీలకు ఓటు అడిగే హక్కు లేదు అని, తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధి కేవలం బీజేపీ తోనే సాధ్యం అవుతుంది అని, తొర్రూరు మున్సిపాలిటీ ప్రజలు బీజేపీ అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి తొర్రూరు మున్సిపాలిటీ ఎన్నికల ఇంఛార్జి పాకనాటి దామోదర్ రెడ్డి,సహ ఇంఛార్జి జలగం రంజిత్, రాష్ట్ర నాయకులు బండి సాంబయ్య, దేవేందర్ రెడ్డి,బీజేపీ తొర్రూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు పైండ్ల రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి భాగాల నవీన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్, జిల్లా మాజీ కార్యదర్శి కొలుపుల శంకర్, పూసాల శ్రీమాన్,అలిసేరి రవిబాబు,మంగళపల్లి యాకయ్య,నడిగడ్డ సందీప్, నూనె అనిల్, ధరావత్ శ్రీనివాస్,వడ్లకొండ రవి, భాస్కరా చారి,రాపాక ప్రశాంత్,కాగు నవీన్,విజయ్ కుమార్, నూకల నవీన్,గంధం రాజు, పెండ్యాల గణేష్,సాయి ముకేష్, మెండీస్,రాజకుమార్,భరత్, ఇస్మాయిల్, శ్రీనాథ్, తేజస్, జలగం రవి,హరీష్, సంతోష్, జగదీష్,తదితరులు పాల్గొన్నారు.



# దశలవారీగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

**కూకట్ పల్లి తెలంగాణ చౌరస్తా:**

శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో దశలవారీగా అభివృద్ధికి పాటుపడుతున్నామని నియోజకవర్గ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. శుక్రవారం ఆల్విన్ కాలనీ, హైదర్ నగర్ డివిజన్ల పరిధిలోని సుమారు కోటి 20 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను డివిజన్ కార్పొరేటర్లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల నుండి వచ్చిన వినతులు, కార్పొరేటర్ల సూచనల ఆధారంగా అత్యవసర ప్రాంతాలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. నిత్యం మురుగు నీరు పొంగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి సమస్యల రహిత కాలనీలుగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమన్నారు. కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ, డ్రైనేజీతో పాటు స్వచ్ఛమైన తాగునీటి పైప్‌లైన్‌ల నిర్మాణం ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తామని గాంధీ పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడబోమని, పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి, జిహెచ్ఎంసి అధికారులు, స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



# ప్రాణం పోయిన దళితుల గుడికి దారి వదలను

- చంపడానికి సిద్ధం, జైలుకు పోవడానికి రేడి
- కుల వివక్ష చూపుతున్న మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్
- నాగర్ గూడలో కులాల మధ్య చిచ్చు లేపుతున్న మాజీ సర్పంచ్
- గురువారం ఎమ్మార్వో సిఐ,లకు కంప్లైంట్ ఇచ్చిన నాగర్ గూడ దళితులు
- చేవెళ్ల ఏసీపీ కి పిర్యాదు చేసిన దళితులు.

**చేవెళ్ల, తెలంగాణ చౌరస్తా:**

చేవెళ్ల నియోజకవర్గం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని శుక్రవారం నాగర్ గూడ,గ్రామ ప్రథమ పౌరుడు ప్రజల చేత ప్రజలు కొరకు ఎన్నుకోబడ్డ నాయకుడు. గ్రామంలోని ఉన్న అన్ని వర్గాలకు, కులమతాలకతీతంగా సమన్యాయం చేయవలసిన బాధ్యత గ్రామ సర్పంచ్ పైనఉంటుంది..కానీ నాగర్ గూడ మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్ దీనికి,విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడు.. గతంలో మీ తాత ముత్తాతలు ఎలా ప్రతి కారో మీరు అలానే బతకాలి! మీరెంత చదువుకున్నా మీరు ఇంత ఎదిగిన మా కిందనే మా వెనకాలే ఉండాలి, లేదంటే వ్యవస్థ అంతా నాకు తెలుసు పోలీసులు తెలుసు, ఎమ్మార్వో తెలుసు రాజకీయ నాయకులు తెలుసు, మేమేం అనుకుంటే ఏదైనా చేస్తామని గ్రామంలోని బిసి సామాజిక వర్గాన్ని, రెచ్చగొడుతున్నాడు. వారికి మద్యం తాగించి కులాల మధ్య చిచ్చు పెడుతున్నాడు.. మీరు ఏదైనా చేయండి నేనేమైనా అయితే చూసుకుంటాను, అని దళితుల పైకి ముకుమ్ముడిగా దాడి చేయడానికి ఉసిగొల్పుతున్నాడు.. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో గ్రామపంచాయతీ కాడికి



రండి మాట్లాడుకుందాం అని పిలిచి, గ్రామంలోని బీసీ సామాజిక వర్గాలు రెచ్చగొట్టి గొడవలకు దారి తీస విద్వేషాలను మాట్లాడుతున్నారు.నాప్రాణం ఉన్నంత కాలం దళితులకు గుడికి వెళ్ళడానికి దారి వదలను, మీరు ఎక్కువ మాట్లాడితే చంపడానికి సిద్ధం జైలుకు వెళ్లడానికైనా సిద్ధం దేనికైనా సిద్ధమని గ్రామపంచాయతీ, కార్యాలయం సమీపంలో సర్పంచ్ గ్రామ ప్రజల సమక్షంలోనే బహిరంగంగా కులాల మధ్యలో విషం నింపుతున్నాడు.

**నాగర్ గూడ దళితులు**

గత కొన్ని సంవత్సరాలుగా పండగల సమయంలో కులాన్ని ప్రస్తావిస్తూ దళిత బోనాలు దళిత పండుగలు మాతోటి కలసి జరుపుకోవద్దని అందరి సమక్షంలోని కులం పేరుతో దూషించారు.. అయినా ఎన్ని రోజులు ఎన్నో అవమాలను ఓర్చుకుంటూ కాలం గడుపుతున్నారు.. దళిత నాయకులు అందరూ కలిసి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే తాము వెళ్లే గుడికి దారికావాలని,గ్రామంలోని ఓ పెద్దమనిషి , సంప్రదించగా,, మీరు అడుగుతున్నది నడవడానికి దారి కదా తీసుకోండి అని తెలిపగా.... గురువారం ఉదయం దళిత యువకులు కలిసి దారి కోసం చదును చేశారు.. ఈ క్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణగౌడ్ గ్రామంలోని గొల్లను కురుమలను వడ్డెరలను రెచ్చగొట్టి దళితులపైకి దాడికి పంపిస్తున్నాడు.. ఈ ఘటనపై గురువారం షాబాద్ స్థానిక ఎమ్మార్వో, సీఐ, ఏసీపీ సమస్యను పరిష్కరించాలని,విజ్ఞప్తిచేశారు



# ఆపదలో అండగా సీఎంఆర్ఎఫ్

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రూ.4 లక్షల విలువైన ఎల్ఓసి అందజేత

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా:**

ఆపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్ పూర్ డివిజన్ కి చెందిన కడాలి రాజేశ్వరి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసనసభ్యులు జిఎంఆర్ ద్వారా ఎల్ఓసి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన 4 లక్షల రూపాయల విలువైన ఎల్ఓసిని శుక్రవారం సాయంత్రం పటాన్చెరు లోని తన కార్యాలయంలో రాజేశ్వరి కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసం బిఆర్ఎస్‌ను గెలిపించండి

- 11,14 వార్డుల అభ్యర్థుల పిలుపు

**తొర్రూర్-తెలంగాణ చౌరస్తా:**



తొర్రూరు అభివృద్ధి కోసం బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని 11,14 వార్డుల అభ్యర్థుల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 11వార్డ్ అభ్యర్థి కర్నె నాగరాజు మాట్లాడుతూ.. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తనపై ఉంచిన నమ్మకంతో 11వ వార్డు అభ్యర్థిగా అవకాశం కల్పించారని తెలిపారు. ఎర్రబెల్లి దయాకర్ రావు నాయకత్వంలో తొర్రూరు పట్టణం ఎంతో అభివృద్ధి చెందిందని, అదే స్ఫూర్తితో తన వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.వార్డులోని ప్రతి గల్లీలో మౌలిక వసతుల కల్పనే తన ధ్యేయమని, ప్రజలు తనను ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.అనంతరం 14వ వార్డ్ అభ్యర్థి మడిపెద్ది స్రవంతి మల్లేష్ మాట్లాడుతూ... రజక సామాజిక వర్గం మహిళ అయిన నన్ను తొర్రూర్ మున్సిపాలిటీ పరిధి లోని 14వ వార్డ్ లో నాకు అవకాశం కలిపించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకి కృతజ్ఞతలు తెలిపారు.నమ్మకాన్ని వమ్ము చేయకుండా వార్డు అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు.పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలంటే బిఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు.వార్డు ప్రజల సమస్యల పరిష్కారమే మా ప్రథమ ప్రాధాన్యత అని, ఎర్రబెల్లి దయాకర్ రావు అండదండలతో తొర్రూరును ఆదర్శ మున్సిపాలిటీగా మారుస్తామని అభ్యర్థులు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# ప్రజలందరూ సమానత్వంతో మెలగాలి

- సర్పంచ్ దున్నా శ్రీనివాస్.

**తెలంగాణ చౌరస్తా, నడిగూడెం**



గ్రామ ప్రజలందరూ సమానత్వంతో మెలగాలని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ కోరారు.శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో తహశీల్దార్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సివిల్స్ రైట్ డే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ పౌర హక్కులకు భంగం కలిగించవద్దని, కులమతలకు అతీతంగా అందరూ ఒకటేనని భావనతో మెలగాలని కోరారు. ఎస్సై జి అజయ్ కుమార్ మాట్లాడుతూ పౌర హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐలు గోపాలరావు, మల్సూర్, పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, జిపిఓ కోటయ్య,వార్డు సభ్యులు దున్నా లింగయ్య,దున్నా మనిషా,కాసాని మాదవి గోపినాద్,సిపిఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ,గుండు విజయరామారావు, సోషల్ ఎల్ఫైర్ అధికారి, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు,ఫీల్డ్ అసిస్టెంట్ , వివో, రెవిన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# గాంధీజీ అహింస మార్గం.. ప్రపంచానికే ఆదర్శం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- జాతిపితకు ఘన నివాళులు

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :** జాతిపిత మహాత్మాగాంధీ అనుసరించిన అహింస మార్గం ప్రపంచానికే ఆదర్శమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని గాంధీ థీమ్ పార్కులో గల గాంధీ మహాత్ముడి కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. భవిష్యత్తు తరాలకు మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవలను అందించాలన్న లక్ష్యంతో నియోజకవర్గ వ్యాప్తంగా సొంత నిధులతో మహాత్ముడి విగ్రహాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మహాత్మగాంధీ బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, నాయకులు నర్ర బిక్షపతి, మాద్రి పృథ్వీరాజ్, వెంకటేష్, శ్యామ్, షకీల్ (లడ్డు), ఇమ్రాన్, హమీద్,పట్టణ పుర ప్రముఖులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# గోలివాడలో ఆధ్యాత్మిక శోభ

- ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి
- సమ్మక్క-సారలమ్మ చెంత అంతర్గాం ఎస్సై దంపతులు
- ఎస్ఐ వెంకటస్వామిని ఘనంగా సన్మానించిన గొలివాడ సమ్మక్క జాతర కమిటి చైర్మన్ గిట్ల శంకర్ రెడ్డి



**రామగుండం,తెలంగాణ చౌరస్తా:** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని గోదావరి తీరాన వెలసిన గోలివాడ సమ్మక్కసారలమ్మ జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. జాతరలో భాగంగా శుక్రవారం అంతర్గాం ఎస్సై బోయ వెంకటస్వామి తన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు.

అమ్మవార్ల దర్శనం అనంతరం జాతర కమిటీ ఆధ్వర్యంలో ఎస్సై దంపతులకు ఘన స్వాగతం లభించింది. జాతర కమిటీ చైర్మన్ గిట్ల శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై బోయ వెంకటస్వామి దంపతులను కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గొలివాడ సమ్మక్క సారలమ్మ జాతర కమిటి చైర్మన్ గిట్ల శంకర్ రెడ్డి మాట్లాడుతూ...జాతర ప్రశాంతంగా సాగడంలో పోలీసు యంత్రాంగం కృషి అభినందనీయమని, 30 నిఘా నేత్రాలతో ,భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఎస్సై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారని కొనియాడారు. జాతరలో ప్రధాన ఘటం ఐన సమ్మక్క సారలమ్మను జాతర గద్దెలకు చేర్చడంలో ఎస్ ఐ వెంకటస్వామి,తన పోలీస్ యంత్రాంగం చేసిన కృషి వర్ణనాతీతమని,జాతరను విజయవంతం చేయడంలో అంతర్గాం ఎస్ఐ, రామగుండం సిఐ ప్రవీణ్ కుమార్, గోదావరి ఖని ఏసిపి రమేష్‌లకు తమ జాతర కమిటి తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

**మొక్కులు చెల్లించుకున్న ఎస్సై కుటుంబం**

అంతకుముందు, ఎస్సై వెంకటస్వామి తన సతీమణితో కలిసి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, శాంతిభద్రతల పరిరక్షణలో దైవ ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకున్నట్లు" తెలిపారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తాము స్వయంగా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించమని, ఆయన తెలిపారు. భక్తులందరూ కూడా తమ పోలీస్ యంత్రాంగానికి సహకరించారని, వారందరికీ, అన్ని శాఖల అధికారులకు కూడా కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ఎస్సై తెలిపారు.

జాతర విజయవంతం చేయడంలో సహకరిస్తున్న పోలీసులకు కమిటీ చైర్మన్ గిట్ల శంకర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.గొలివాడ తీరంలో భక్తుల పుణ్యస్నానాలు, మొక్కులతో జాతర ప్రాంగణం కిక్కిరిసిపోయింది.



# ప్రజల ఆశీస్సులతో... అభివృద్ధి పథంలో 29వ డివిజన్

- ఘనంగా నామినేషన్ దాఖలు చేసిన బిఆర్ఎస్ అభ్యర్థి నిమ్మరాజుల రజిని రవి
- లింగాపూర్, హౌసింగ్ బోర్డు కాలనీల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం
- కరోనా కష్టకాలంలోనూ,ఉపాధి హామీ కూలీల పక్షాన నిరంతర పోరాటం.
- మున్సిపల్ విలీనానికి వ్యతిరేకంగా సాగించిన ఉద్యమమే బలం.
- నిమ్మరాజుల రజిని రవి

**రామగుండం,తెలంగాణ చౌరస్తా:** ప్రజల దీవెనలే శ్రీరామరక్షగా.. 29వ డివిజన్ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నిమ్మరాజుల రజిని రవి పేర్కొన్నారు. శుక్రవారం భారీ జనసందోహం నడుమ, కార్యకర్తల కోలాహలం మధ్య వారు తన నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు.ఈ సందర్భంగా రజిని రవి మాట్లాడుతూ, గత అనేక సంవత్సరాలుగా తాము ప్రజా క్షేత్రంలోనే ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా గ్రామ మున్సిపల్ విలీనాన్ని వ్యతిరేకిస్తూ ప్రజల గొంతుకై నిలబడి అనేక పోరాటాలు చేశామని గుర్తుచేశారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి ప్రజలందరికీ అండగా నిలిచామని వివరించారు.

**కూలీల పక్షపాతి:**

ఉపాధి హామీ కూలీల సమస్యలపై స్పందిస్తూ, వారికి రావలసిన హక్కుల కోసం ఎల్లప్పుడూ పోరాడుతున్నామన్నారు.

**అభివృద్ధి ప్రణాళిక:**

"లింగాపూర్, ఇందిరమ్మ కాలనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీ ప్రజల ఆశీస్సులు మాకు కొండంత బలం. రాబోయే రోజుల్లో 29వ డివిజన్‌ను ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతాం. మాపై నమ్మకముంచి, కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని" వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొని రజిని రవికి తమ మద్దతును ప్రకటించారు.

# నూతన మున్సిపాలిటీలో భారీ నామినేషన్లు

**మద్దూర్,తెలంగాణ చౌరస్తా:** నారాయణపేట జిల్లా,మద్దూరు మున్సిపాలిటిలోని రెండవ సాధారణ ఎన్నికల రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ద్వారా నామినేషన్లకు చివరి రోజు అయిన 3012026 న 67 నామినేషన్లు స్వీకరించబడ్డాయి. మొత్తంగా 89 నామినేషన్లు స్వీకరించబడ్డాయని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

# చేవెళ్ల 17వ వార్డుకు ముదావత్ కృష్ణ నాయక్ నామినేషన్ దాఖలు

- బాలాజీ దర్శనంతో ప్రారంభమైన ప్రచారం
- యువ నాయకత్వానికి ప్రజల మద్దతు వెల్లువ



**చేవెళ్ల,తెలంగాణ చౌరస్తా:** చేవెళ్ల మున్సిపాలిటీ 17వ వార్డు కౌన్సిలర్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా ముదావత్ కృష్ణ నాయక్ శుక్రవారం అధికారికంగా తన నామినేషన్‌ను దాఖలు చేశారు.నామినేషన్ ప్రక్రియకు ముందు ముదావత్ కృష్ణ నాయక్ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులతో కలిసి భారీ ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...నూతన యువతరానికి అవకాశం ఇస్తే 17వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తాం మౌలిక వసతులు,పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు వంటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రతి ఇంటికీ న్యాయం చేసే విధంగా పని చేస్తామని ఆయన స్పష్టం చేశారు. నామినేషన్ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముదావత్ కృష్ణ నాయక్‌కు సంఘీభావం తెలిపారు.



# ముగ్గురు దోపిడి దొంగలు అరెస్టు

- రిమాండ్ కు తరలింపు
- ముఠాగా ఏర్పడి చోరీలు
- చాకచక్యంగా చేదించిన పోలీసులు
- నాలుగు ఫోన్లు,రూ.2,04,000 నగదును స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ సురేష్ కుమార్

**మేడిపల్లి, తెలంగాణ చౌరస్తా:** మేడిపల్లి పోలీస్ స్టేషన్, బోడుప్పల్ సర్కిల్లో సంక్రాంతి సెలవుల సందర్భంగా పండుగకు ఊరికి వెళ్లిన సమయంలో ఈ నెల 15న వరుస ఇండ్లలో చోరీలు చేసి పరారైన అంతరాష్ట్ర నిందితులను మేడిపల్లి పోలీసులు అరెస్ట్ చేసి కటకటాల పాలు చేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ సురేష్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఢిల్లీకి చెందిన మహాదేవ్ ఝా (A1), పవన్ గుప్తా (A2), కాన్పూర్కు చెందిన మంగళ్ సింగ్ (A3) లు బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని 9 ఇళ్లలో చోరీలకు పాల్పడి 250 గ్రాముల బంగారం, 6 కిలోల వెండి, రూ.2 లక్షల నగదును దోచుకొని పరారైనట్లు తెలిపారు.

**ముగ్గురు ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడిన దొంగలు**

ఈ కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా వరుస నేరాలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరితో పాటు దొంగ సొత్తు కొనుగోలు చేసిన బీహార్ కు చెందిన సీరామ్ సవ్ బీరేంద్ర (A4) ను కూడా ట్రాన్సిట్ వారెంట్పై మేడిపల్లి తీసుకువచ్చి ఇద్దరు నిందితులను రిమాండ్ కు తరలించారు. మరో ఇద్దరు నిందితులను బీహార్ నుంచి మేడిపల్లికి తీసుకువస్తున్నట్లు డీసీపీ తెలిపారు.నిందితులు గతంలో నల్గొండ, వరంగల్, జనగాం పోలీస్ స్టేషన్ల పరిధిలో కూడా పలు చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు తెలిపారు. వారి నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, రూ.2,04,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీస్ సిబ్బందిని డీసీపీ సురేష్ కుమార్ అభినందించి రివార్డులు అందించారు.రిమాండ్ అనంతరం కేసుపై మరింత లోతుగా దర్యాప్తు చేపడతామని తెలిపారు.



# మూడు చింతలపల్లిలో బిజెపి అభ్యర్థుల నామినేషన్లు

- ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్,
- జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్
- తుప్పత్ ఆనంద్ ఆధ్వర్యంలో 24వ వార్డులో జోరుగా ప్రచారం

**బోడుప్పల్,తెలంగాణ చౌరస్తా:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిహెచ్ఎంసి పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ బోడుప్పల్ ఈస్ట్ జోన్ బిజెపి ప్రధాన కార్యదర్శి తుప్పత్ ఆనంద్ మూడుచింతలపల్లి మున్సిపాలిటీ 24వ వార్డ్ ఇన్చార్జిగా తన బాధ్యతలను చురుకుగా నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా మూడు చింతలపల్లిలో బిజెపి అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మేడ్చల్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి, తుప్పత్ ఆనంద్, ఇతర బిజెపి నేతలు పాల్గొన్నారు. అనంతరం 24వ వార్డులో తుప్పత్ ఆనంద్ ఆధ్వర్యంలో స్థానిక బిజెపి నేతలతో కలిసి జోరుగా ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ప్రజల నుండి బిజెపి అభ్యర్థులకు అపూర్వ స్పందన లభిస్తుందని, ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలే భారతీయ జనతా పార్టీని గెలిపిస్తాయని తుప్పత్ ఆనంద్ ఆశాభావం వ్యక్తం చేశారు.



# ప్రకృతి మన జీవనాధారం.. దాన్ని రక్షించుకుందాం

- ప్లాస్టిక్ నిషేధం – కెమికల్స్ వాడకం తగ్గించాలి
- ప్రకృతి,సమానత్వం,భారత రాజ్యాంగ విలువలను కాపాడుకుందాం
- ప్రకృతి పరిరక్షణకై వైజ్ఞానిక యాత్రలో
- ట్రైకార్ చైర్మన్ డా.తేజావత్ బెల్లయ్య నాయక్,
- ప్రకృతి ప్రజాకవి జయరాజ్,సామాజిక శాస్త్రవేత్త డా.రమేష్

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో ప్రకృతి వైజ్ఞానిక యాత్ర నాలుగో రోజు కార్యక్రమం నిర్వహించారు. "ప్లాస్టిక్ నిషేధం - కెమికల్స్ వాడకం తగ్గించి ప్రకృతి,సమానత్వం, భారత రాజ్యాంగ విలువలను కాపాడుకుందాం" అనే సందేశంతో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ట్రైకార్ చైర్మన్ డా.తేజావత్ బెల్లయ్య నాయక్, ప్రకృతి ప్రజాకవి జయరాజ్,సామాజిక శాస్త్రవేత్త డా.రమేష్ పాల్గొని ప్రజా సంఘాలు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ప్రకృతి మన జీవనానికి ఆధారం అని,దాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.వైజ్ఞానిక దృక్పథం అంధవిశ్వాసాలకు ప్రత్యామ్నాయంగా ఉండాలని,స్వేచ్ఛ,సమానత్వం, సౌభ్రాతృత్వం భారత రాజ్యాంగానికి మూల స్తంభాలని తెలిపారు.ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి తీవ్ర హానికరమని,భూమిలో వందల నుంచి లక్షల సంవత్సరాల వరకు కరుగకుండా ఉండి జీవరాసులకు ప్రమాదం కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ పెన్నులు,బాటిళ్లు,వస్తువులకు బదులుగా పేపర్ పెన్నులు,స్టీల్,రాగి వంటి సహజ వస్తువుల వినియోగం పెంచాలని పిలుపునిచ్చారు. పాలిప్రోపైలిన్ వంటి కెమికల్స్ ఆరోగ్యానికి ప్రమాదకరమని,క్యాన్సర్ వంటి వ్యాధులకు కారణమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు .విజ్ఞాన దర్శిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ అలీ,రాష్ట్ర కమిటీ సభ్యురాలు జయశ్రీ,జనవిజ్ఞాన వేదిక,విజ్ఞాన దర్శిని నాయకత్వంలో పేపర్ పెన్నుల వినియోగాన్ని ప్రారంభించి విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యా సంస్థలు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడడం ప్రతి పౌరుడి కర్తవ్యమని, విద్యాసంస్థల్లో ప్లాస్టిక్ వాడకం తగ్గించి పేపర్ పెన్నుల వినియోగాన్ని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. రీసైక్లింగ్ యంత్రాల ఏర్పాటు ద్వారా ప్రభుత్వ స్థాయిలో చర్యలు తీసుకోవాలని విజ్ఞానదర్శిని, జనవిజ్ఞాన వేదిక నేతలు కోరారు.ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు,కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని ప్రకటించారు.

# మండల జలవనరుల గణన

- తహాశిల్దార్ పి. శ్రీనివాస్ రావు



**నూతనకల్ తెలంగాణ చౌరస్తా :** నూతనకల్ మండలంలో కేంద్ర ప్రభుత్వం,రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 7వ చిన్న నీటిపారుదల గణన, 2వ నీటి వనరుల గణన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తహాశిల్దార్ పి. శ్రీనివాస్ రావు తెలియజేశారు. మండలంలోని జల వనరులను పరిశీలించడానికి హైద్రాబాద్ నుండి ఆర్థిక & గణాంక శాఖ ఉప సంచాలకులు నందిని, సిపిఓ ఎల్. కిషన్,గణాంక అధికారి వి.రామారావు, ఉప గణాంక అధికారి తిరుమలేష, నూతన్‌కల్ మండల ప్రణాళిక, గణాంక అధికారి సందీప్,నూతనకల్ మండలంలో గణన పనులపై క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని రకాల నీటి వనరులు ,చెరువులు, కుంటలు, సరస్సులు, కాలువలు, ట్యాంకులు మొదలైనవి వాటి సంఖ్య, విస్తీర్ణం, వినియోగం, ప్రస్తుత స్థితి వంటి వివరాలను సేకరించి నమోదు చేయడాన్ని జల వనరుల గణన అంటారు.ఈ గణన ద్వారా నీటి వనరులపై ఖచ్చితమైన సమాచారం సేకరించి, భవిష్యత్తులో నీటిపారుదల ప్రణాళికలు,అభివృద్ధి కార్యక్రమాలు విధాన నిర్ణయాలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.గణన సక్రమంగా పూర్తి కావడానికి ప్రజలు, రైతులు సంబంధిత అధికారులకు సహకరించాలని కోరారు





# గోలివాడలో వైభవంగా సమ్మక్కసారలమ్మ జాతర

- అమ్మవార్లకు 'నిలువెత్తు బంగారం' సమర్పించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్
- శాంతిభద్రతల పరిరక్షణలో కీలకంగా వ్యవహరించిన పోలీసులకు ఘన సన్మానం

**రామగుండం,తెలంగాణ చౌరస్తా:**

అంతర్గాం మండలం గోలివాడ గ్రామంలో శ్రీ సమ్మక్కసారలమ్మ జాతర అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జాతర ప్రాంగణానికి చేరుకున్న ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, పూజారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవార్లకు తన నిలువెత్తు బంగారం (బెల్లం) మొక్కుగా సమర్పించుకున్నారు.



సాధారణ భక్తుడిలా స్థానిక ప్రజలతో ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వయంగా భక్తులకు అమ్మవారి బంగారం,ప్రసాదలు పంపిణీ చేశారు.

**శాంతి భద్రతలపై ప్రశంసలు - అధికారులకు సన్మానం:**

జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, భక్తులకు అసౌకర్యం కలగకుండా చూస్తున్న పోలీసు యంత్రాంగాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, అంతర్గాం ఎస్ఐ వెంకట స్వామిలను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ శాలువాతో ఘనంగా సన్మానించారు.

**ప్రజల సంక్షేమమే ధ్యేయం:**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... "ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని ఆ తల్లులను కోరుకున్నాను. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడం సంతోషకరం" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# వనదేవతల జాతరలో ట్రినిటీ ఇంజనీరింగ్ వాలంటీర్ల సేవలు

- తుర్కలమద్దికుంట సమ్మక్క సారలమ్మ జాతరలో ట్రినిటీ ఇంజనీరింగ్ వాలంటీర్ల సహాయ సహకారాలు
- ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలను అభినందించిన భక్తులు, ప్రజాప్రతినిధులు

**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా :**

కోరిన కోర్కెలు తీర్చే భక్తుల కొంగుబంగారమైన సమ్మక్క సారలమ్మ వనదేవతలు వనం వీడి జనంలోకి వచ్చి పసుపు, కుంకుమగా గద్దెలపై కొలువుదీరారు. పెద్దపల్లి మండలంలోని తుర్కలమద్దికుంట గ్రామంలో వెలసిన సమ్మక్క సారలమ్మ జాతరలో గత రెండు రోజుల నుంచి ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రశంసనీయమైన సేవలు అందించారు. ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచడం, రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా భక్తులకు సహాయ సహకారాలు అందించడం లాంటి తదితర కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. జాతరకు పెద్దసంఖ్యలో భక్తులు తరలి రావడంతో క్యూలైన్ ద్వారా దర్శనానికి తరలించడం, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, భక్తులకు అవసరమైన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు, ప్రజాప్రతినిధులు వాలంటీర్ల సేవలను అభినందించారు. సమాజ సేవే లక్ష్యంగా ట్రినిటీ ఇంజనీరింగ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డా. అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ డా. మణి గణేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజేందర్, చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# బాల్యవివాహాల నిర్మూలనకు సహకరించాలి

- తహశీల్దార్ రామకృష్ణారెడ్డి

**తెలంగాణ చౌరస్తా,నడిగూడెం:**

బాల్య వివాహాల నిర్మూలనకు తల్లిదండ్రులు సహకరించాలని మండల తహశీల్దార్ రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం నడిగూడ మండల కేంద్రంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో బాల్య వివాహల నిర్మూలలకై గ్రామంలో ప్రధాన రహదారిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.అనంతరం బస్టాండ్ వద్ద జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టి తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు.ఎంపీడీవో మల్సూర్ నాయక్ మాట్లాడుతూ చదువుకునే వయసులో పెళ్లిళ్లు చేయరాదని తల్లిదండ్రులకు సూచించారు.ఎస్సై జి అజయ్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యాధికారి హరినాథ్ మాట్లాడుతూ చిన్నతనంలో పెళ్లిళ్లు చేస్తే అనారోగ్యానికి గురయ్య ప్రమాదాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దున్న శ్రీనివాస్,ఎంపీఓ విజయలక్ష్మి ,పంచాయతీ కార్యదర్శి యలకా ఉమారాణి, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, ఉపసర్పంచ్ ఎలుగూరి నాగరాజు,వార్డు సభ్యులు దున్నా లింగయ్య,బాణాల సతీష్ కుమార్, కాసాని మాదవి గోపినాథ్,నాయకులు పందిరి వెంకటరెడ్డి,గుండు శ్రీనివాస్,చిల్లంచర్ల సత్యనారాయణ,గడ్డం మల్లేష్ యాదవ్,బెల్లంకొండ సత్యనారాయణ,గుండు విజయరామారావు,దాసరి శ్రీనివాస్,పల్లపు నాగేశ్వరరావు,కాసాని శివకృష్ణ, కొండా వెంకన్న,షేక్ జలీల్,కత్తి విజయ్,మౌలాన, శ్రీరాముల శ్రీను,యలక సంజీవరెడ్డి,షేక్ జలాలుద్దీన్,కన్నీబోయిన కిషోర్,ఆర్ఐలు గోపాలరావు,మల్సూర్, జి పి ఓ కోటయ్య, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ నిర్వాహకురాలు నోసిన లావణ్య, మండల జిపిఓలు,అంగన్వాడీ టీచర్లు,ఆశా కార్యకర్తలు,వైద్య సిబ్బంది,గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



# రామగుండం గడ్డపై జనసేన జెండా ఎగురవేస్తాం

- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం
- రావుల మధు
- 32వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా రావుల విజయలక్ష్మి నామినేషన్

**రామగుండం,తెలంగాణ చౌరస్తా:**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల పోరులో జనసేన పార్టీ తన దూకుడును పెంచింది. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా, తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి ఆర్.కె. సాగర్ సూచనల మేరకు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 32వ డివిజన్ జనసేన పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా రావుల విజయలక్ష్మి శుక్రవారం భారీ ఎత్తున నామినేషన్ దాఖలు చేశారు.తెలంగాణ రాష్ట్ర యువజన అడ్ హాక్ కమిటీ సభ్యులు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు రావుల మధు ఆధ్వర్యంలో ఈ నామినేషన్ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా రావుల మధు మాట్లాడుతూ,...రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో నెలకొన్న స్థానిక సమస్యల పరిష్కారం కోసం జనసేన నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ముఖ్యంగా 32వ డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పన, యువతకు ఉపాధి అవకాశాలు, పారదర్శక పాలన అందించడమే విజయలక్ష్మి లక్ష్యమని పేర్కొన్నారు.

**మహిళా సాధికారతకు నిదర్శనం**

అభ్యర్థి రావుల విజయలక్ష్మి మాట్లాడుతూ.. "ప్రజల పక్షాన నిలబడేందుకు జనసేన నాకు అవకాశం ఇచ్చింది.మార్పు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.సామాన్య ప్రజల గొంతుకగా కౌన్సిల్‌లో అడుగుపెట్టి,డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాను" అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జై జనసేన నినాదాలతో హోరెత్తించారు.




# గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- సుల్తానాబాద్ మున్సిపల్ గడ్డపై కాషాయ జెండా ఎగరాలి
- బీజేపీలో చేరిన పలువురు నాయకులు
- బీజేపీ మండల నాయకులతో ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య

**సుల్తానాబాద్,తెలంగాణ చౌరస్తా:**

రాబోయే సుల్తానాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ మండల కార్యకర్తలకు ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య పిలుపునిచ్చారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో చురుకుగా పనిచేయాలని, ప్రజలకు మరింత చేరువై సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సుల్తానాబాద్ మున్సిపాలిటీలో పర్యటించి, పార్టీ కార్యాలయంలో మండల నాయకులతో, కార్యకర్తలతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తే బీజేపీ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి మున్సిపాలిటీలోని ప్రతి గడపగడపకు తిరుగుతూ, ప్రజలకు వివరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరడంతో పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. బీజేపీపై ప్రజలకు నమ్మకం పెరుగుతోందని, నరేంద్ర మోడీ నాయకత్వంలో వికసిత భారత్, ఆత్మనిర్భర్, శక్తివంతమైన, సమృద్ధిశాలి భారత నిర్మాణమే మా లక్ష్యమని ఎమ్మెల్సీ ధీమా వ్యక్తం చేశారు. అనంతరం సుల్తానాబాద్ మున్సిపల్ గడ్డపై కాషాయపు జెండా ఎగరేలా బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు కందుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు కూకట్ల నాగరాజు, 15 వార్డుల బీజేపీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# 33వ డివిజన్ బరిలో దుర్గం నగేష్

- కార్పొరేటర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు
- పదవుల కంటే పేదల కన్నీళ్లు తుడవడమే లక్ష్యం
- భారీగా తరలివచ్చిన అభిమానులు, సామాజిక కార్యకర్తలు
- సేవకు పట్టం కట్టాలని ఓటర్లకు విజ్ఞప్తి

**రామగుండం,తెలంగాణ చౌరస్తా:**

రామగుండం నగరపాలక సంస్థ 33వ డివిజన్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. సామాజిక సేవా కార్యక్రమాలతో నిత్యం ప్రజల మధ్య ఉండే సమతా ఫౌండేషన్ చైర్మన్, సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ శుక్రవారం 33వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. తన మద్దతుదారులు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీగా తరలివెళ్లి ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. కేవలం ఎన్నికల సమయంలో వచ్చే నాయకుల్లా కాకుండా, ఆపదలో ఉన్నప్పుడు ఆదుకునే వ్యక్తిగా నగేష్‌కు డివిజన్‌లో మంచి పేరుంది. ముఖ్యంగా కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ఆయన చేసిన సేవలు, అన్నపూర్ణ కాలనీలో సొంత నిధులతో నిర్మించిన 'సమత గ్రంథాలయం' ద్వారా విద్యార్థులకు అందిస్తున్న విజ్ఞాన సంపద ఆయనకు ప్రధాన బలమని విశ్లేషకులు భావిస్తున్నారు. నామినేషన్ అనంతరం నగేష్ మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా వివక్ష లేని సమాజాన్ని నిర్మించడమే తన ఆశయమని పేర్కొన్నారు. "వారసులంటే ఆస్తిని పంచుకునే వారు కాదు.. ఆశయాలను పంచుకునే వారు" అని నమ్మి యువతలో చైతన్యం నింపుతున్నట్లు చెప్పారు. డివిజన్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి ప్రజలు తనకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో చీమల ఆనంద్, జిమ్మిడి అశోక్, నాస సునీత, తాళ్లపల్లి రవళి, జిమ్మిడి శాంతి కుమార్, చందనగిరి శంకర్, దుర్గం వెంకట నరసయ్య, రామటెంకి విశ్వనాథ్, కుమ్మరి మల్లేష్, దాసరి వంశీకృష్ణ తదితరులు పాల్గొని నగేష్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

# డబ్బుంటేనే టిక్కెటా..?

- నిబద్ధత గల నాయకులను విస్మరిస్తారా?
- రాజకీయ పార్టీల తీరుపై 'దళిత సామాజిక హక్కుల పరిరక్షణ సమితి' ఆగ్రహం
- దళిత సామాజిక హక్కుల పరిరక్షణ సమితి
- జిల్లా అధ్యక్షులు చిలుక ప్రసాద్

**రామగుండం,తెలంగాణ చౌరస్తా:**

రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఎన్నికల వాతావరణం వేడెక్కుతున్న వేళ, రాజకీయ పార్టీల టికెట్ల కేటాయింపు ప్రక్రియపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దశాబ్దాలుగా పార్టీ కోసం శ్రమించిన సీనియర్ నాయకులను, నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసే కార్యకర్తలను పక్కనపెట్టి, కేవలం 'డబ్బు మూటలు' పట్టుకొచ్చే వారికే పెద్దపీట వేయడంపై దళిత సామాజిక హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు చిలుక ప్రసాద్ మండిపడ్డారు. శుక్రవారం గోదావరిఖని చౌరస్తాలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన రాజకీయ నాయకత్వాల ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. పార్టీ గెలుపు కోసం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని, నిస్వార్థంగా సేవలం



దించిన దళిత బహుజన నాయకులను అధికార, విపక్ష పార్టీలు విస్మరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాసేవ చేయాలన్న సంకల్పం ఉన్నవారిని కాదని, ధనబలమే ప్రాతిపదికగా అభ్యర్థులను వెతకడం సిగ్గుచేటన్నారు. పార్టీ అధినాయకత్వాలు చేస్తున్న ఈ పొరపాట్లను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ఓటు రూపంలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

**ద్వితీయ శ్రేణి నాయకత్వం ఏకం కావాలి**

పార్టీల అగ్రనాయకత్వం అనుసరిస్తున్న ఈ ధనరాజకీయాలకు బుద్ధి చెప్పేలా ద్వితీయ శ్రేణి నాయకత్వం సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడి, ప్రజల్లో మంచి గుర్తింపు ఉన్న నిజమైన నాయకులకే టికెట్లు కేటాయించాలని చిలుక ప్రసాద్ డిమాండ్ చేశారు. "పార్టీ జెండా మోసిన కార్యకర్తలను కాదని, డబ్బున్న వారికే టికెట్లు ఇస్తామంటే చూస్తూ ఊరుకోమని, ప్రజాస్వామ్యాన్ని ధనస్వామ్యంగా మారుస్తున్న తీరుపై మా పోరాటం ఆగదని అన్నారు.



# జనంతో మమేకమై..
# ప్రజాసేవకై బూరుగు వంశీకృష్ణ

- రామగుండం కార్పొరేషన్ 57వ డివిజన్ బిఆర్ఎస్ అభ్యర్థిగా ఘనంగా నామినేషన్
- గెలుపే లక్ష్యంగా భారీర్యాలీ.. తరలివచ్చిన జనసందోహం

**రామగుండం,తెలంగాణ చౌరస్తా:**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నగారా మోగడంతో రాజకీయ సమీకరణాలు వేడెక్కాయి. 57వ డివిజన్ బి.ఆర్.ఎస్ అభ్యర్థిగా యువ నాయకుడు బూరుగు వంశీకృష్ణ శుక్రవారం అత్యంత వైభవంగా నామినేషన్ దాఖలు చేశారు. వందలాది మంది కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజల కేరింతల మధ్య భారీ ర్యాలీతో తరలివచ్చి తన అభ్యర్థిత్వాన్ని సమర్పించారు.నామినేషన్ అనంతరం వంశీకృష్ణ మాట్లాడుతూ పేదల సంక్షేమం, డివిజన్ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. "రామగుండం కార్పొరేషన్ పై గులాబీ జెండా ఎగిరితేనే ఈ ప్రాంతానికి శ్రీరామరక్ష" అని ఆయన ఉద్ఘాటించారు. కేసీఆర్, కేటీఆర్, కొప్పుల ఈశ్వర్ ల ఆశీస్సులతో, రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి, కోరుకంటి చందర్ నాయకత్వంలో మేయర్ పీఠాన్ని బి.ఆర్.ఎస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

**యువతకు పెద్దపీట.. అభివృద్ధికి బాట**

అధికారం లేని సమయంలో కూడా డివిజన్ సమస్యలపై నిరంతరం పోరాడానని, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించానని వంశీకృష్ణ గుర్తు చేశారు. తనను అత్యధిక మెజారిటీతో గెలిపించి, రామగుండం గడ్డపై బి.ఆర్.ఎస్ సత్తాను చాటాలని ఆయన ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ అధికార ప్రతినిధి జహిద్ పాషా, మాజీ కోఆప్షన్ సభ్యులు తస్నింబాను, పరస స్వాతి, నాయకులు షరీఫ్, నడిపల్లి సాయి, అక్బర్, మడిపెల్లి తిరుపతి, గణపురం శ్రీధర్, జాలి రవి కుమార్, బుర్ర కుమారస్వామి, శ్రీరాముల కొమురయ్య, కనకయ్య, ఓదెలు, నమైండ్ల సాయి, నామ శివ, ఛత్రియ కమల్, జ్యోతి, రాధ, పద్మ, అసిఫా తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# పుర' పోరులో కాంగ్రెస్ జెండా ఎగరాలి

- ఈ ఎన్నికలు మన పార్టీకి అత్యంత కీలకం
- ప్రజల నమ్మకాన్ని మరింత బలపరచుకునే అవకాశం
- కొత్త,పాత అనే తేడా లేకుండా పార్టీ అభ్యర్థుల గెలుపుకై పని చేయాలి
- ప్రజా ప్రభుత్వ అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలి
- తొర్రూర్ పట్టణ మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశంలో
- ఎమ్మెల్యే మామిడాల యశస్విని
- టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి





**తొర్రూర్-తెలంగాణ చౌరస్తా:**

తొర్రూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు.తొర్రూర్ పట్టణ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశంలో పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు..ఈ సమావేశంలో శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి మాట్లాడుతూ..తొర్రూర్ మున్సిపాలిటీలో ఉన్న 16 వార్డులలో ప్రతి ఒక్క వార్డులో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాల్సిందే. ఈ ఎన్నికలు మన పార్టీకి అత్యంత కీలకమైనవని, ప్రజల నమ్మకాన్ని మరింత బలపరచుకునే అవకాశం ఇదే అని అన్నారు.కొత్త నాయకులు, పాత నాయకులు అనే తేడా లేకుండా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు పూర్తి బాధ్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఇంటింటి ప్రచారం, బూత్ స్థాయి సమన్వయం, ప్రజా సమస్యలపై అవగాహన కల్పించడం ద్వారా పార్టీ బలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, హామీల అమలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులపై కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన దృష్టి ఉందని చెప్పారు.అనంతరం టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికలు పార్టీ భవిష్యత్తును నిర్ణయించే కీలకమైనవని, ప్రతి వార్డులో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలంటే కార్యకర్తల కృషి, ఐక్యత అత్యంత అవసరమని అన్నారు. పార్టీ సిద్ధాంతాలు, రాష్ట్రప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా అనుకూల నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేస్తూ, తొర్రూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడమే తమ ధ్యేయమని ప్రకటించారు .ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు, పట్టణ నాయకులు, వార్డు ఇన్‌చార్జీలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# కుష్టు వ్యాధి అవగాహన అందరి బాధ్యత

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఆశ్రిత

**నూతనకల్, తెలంగాణ చౌరస్తా :**

జడ్పీహెచ్ఎస్ నూతనకల్ లో మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వివక్షను అంతం చేయడం గౌరవాన్ని కాపాడటం అనే నినాదంతో స్పర్శ్ కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఈ కార్యక్రమం జనవరి 30 నుండి ఫిబ్రవరి 13 వరకు ఉంటుంది అని డాక్టర్ ఆశ్రిత అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు గల చర్మం, చెవులపై, వీపుపై ,ఎదపై నొప్పిలేని బొడిపెలు, అరచేతులు అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, కాళ్లకు చెప్పులు జారిపోవడం, చేతుల నుండి వస్తువులు జారిపోవడం కాళ్లు చేతులు తిమ్మిర్లు కలిగి ఉండడం, చేతి వేళ్ళు కాలి వేళ్ళు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం ఏమైనా లక్షణాలు ఉన్నట్లయితే స్థానిక ఆశా కార్యకర్తలకు, ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇఅందించాలని అన్నారు.వ్యాధి లక్షణాలు నిర్ధారణ అయినట్లయితే వారికి ఎండిటి చికిత్స విధానం ద్వారా వ్యాధిని నయం చేయవచ్చని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది ప్రతి గ్రామంలో ఈ యొక్క కార్యక్రమం నిర్వహించే సమయంలో ప్రజా ప్రతినిధులు అధికారులు సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నూతనకల్ సర్పంచ్ మహేశ్వరం మల్లిఖార్జున్ ,తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి సామాజిక ఆరోగ్య అధికారి లావుడ్య చరణ్ , హెడ్ మాస్టర్ మోతిలాల్ ఉపాధ్యాయులు, సూపర్వైజర్ చిన్ని ,ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# బాగా చదవండి..
# 2.2కోట్లు గెలుచుకోండి

- తుంగతుర్తి ఎఎంసి తీగల గిరిధర్ రెడ్డి

**నూతనకల్ తెలంగాణ చౌరస్తా:**

నూతనకల్ ప్రభుత్వ పాఠశాలలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాగా చదవండి 2.2కోట్లు గెలుచుకోండి అనే కార్యక్రమనికి సంబందించిన కరపత్రం ఆవిష్కరణ చేసిన తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి.ఈ సందర్భంగా చైర్మన్ గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ బాగా చదవండి 2.2కోట్లు గెలుచుకొండి అనే కార్యక్రమం నిర్వహిస్తున్న శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వారికీ ధన్యవాదములు తెలియజేస్తూ ఈ అవకాశన్ని మండలంలోని పదవ తరగతి విద్యార్థులు అందరూ వినియోగించుకోవాలని,మండల స్థాయిలో, నియోజకవర్గం ,జిల్లా,రాష్ట్రా స్థాయిలలో రాణించాలని,ప్రైజ్ మనీ గెలుచుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లికార్జున్,శ్రీరామ్ చిట్స్ ప్రతినిధులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# గోలివాడలో 'మినీ మేడారం' సందడి

- కిక్కిరిసిన భక్తజనం
- కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకున్న పెద్దపల్లి అదనపు కలెక్టర్ అరుణశ్రీ
- ప్రజలందరికీ శ్రీ సమ్మక్క-సారలమ్మ దేవతల దీవెనలు ఉండాలి
- అంతర్గాం తహసీల్దార్ తూము రవీందర్ పటేల్

**రామగుండం,తెలంగాణ చౌరస్తా**

అంతర్గాం మండలం గోలివాడ గ్రామంలో శ్రీ సమ్మక్కసారలమ్మ జాతర అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. గత మూడు రోజులుగా జరుగుతున్న ఈ వేడుకల్లో అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. మేదారం జాతరను తలపిస్తూ భక్తజనం భారీగా తరలిరావడంతో గోలివాడ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభతో వెలిగిపోతోంది.ఈ జాతరకు ఇప్పటివరకు సుమారు 5 లక్షల మందికి పైగా భక్తులు హాజరై అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టుపక్కల జిల్లాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, తాత్కాలిక గుడారాలను ఏర్పాటు చేసుకుని ఇక్కడే బస చేస్తూ జాతర సంబరాల్లో మునిగితేలుతున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తహసీల్దార్ తూము రవీందర్ పటేల్, ఎస్సై వెంకట్, రెడ్డిని ఎంపీడీవో తిరుపతి, మండల స్థాయి అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఎక్కడా తొక్కిసలాట జరగకుండా, ఎటువంటి ఒత్తిడి లేకుండా భక్తులు క్రమశిక్షణతో క్యూ పద్ధతిలో అమ్మవార్లను దర్శించుకునేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ వేడుకల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ తన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి తహసిల్దార్ తూము రవీందర్ పటేల్ దగ్గరుండి అమ్మవార్ల దివ్య దర్శనంను చేపించారు. ఉన్నతాధికారులందరూ తమ కుటుంబాలతో కలిసి ఇక్కడి జాతరను సందర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. "ప్రజలందరికీ శ్రీ సమ్మక్కసారలమ్మ దేవతల దీవెనలు ఉండాలి. భక్తులు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నాను. ఏటా ఈ జాతరకు భక్తుల సంఖ్య పెరుగుతుండటం శుభపరిణామని తూము రవీందర్ పటేల్, తహసీల్దార్, అంతర్గాం అన్నారు.



# అంతర్గాంలో సీఎం కప్ క్రీడా సమరం

**రామగుండం, తెలంగాణ చౌరస్తా:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సీఎం కప్2026' క్రీడా పోటీలకు రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా అంతర్గాం మండల స్థాయి పోటీలను స్థానిక జెడ్పీ హెచ్ ఎస్ అంతర్గాం టిటిఎస్ ఆవరణలో నిర్వహించనున్నట్లు మండల తహసీల్దార్ తూము రవీందర్ పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు.

**పోటీల వివరాలు:**

క్రీడాకారుల సౌకర్యార్థం ఈ పోటీలను రెండు రోజులుగా విభజించారు.

ఫిబ్రవరి 03, 2026 బాలికలు, మహిళలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్

ఫిబ్రవరి 04, 2026 బాలురు, పురుషులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్

**అర్హత:**

మండల స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తదుపరి స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుంది.

**తప్పనిసరి పత్రాలు:**

క్రీడల్లో పాల్గొనే వారు తప్పనిసరిగా సీఎం కప్ రిజిస్ట్రేషన్ ఫారం,ఆధార్ కార్డు జిరాక్స్ వెంట తీసుకురావాలి.ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోని వారికి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉండదు.

**మరిన్ని వివరాలకు సంప్రదించండి:**

క్లస్టర్ ఇంచార్జ్/ఫిజికల్ డైరెక్టర్: శోభారాణి (మొబైల్: 9866573416) ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుపతి, మండల విద్యాధికారి సంగీత, ఫిజికల్ డైరెక్టర్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని యువత, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ క్రీడా స్ఫూర్తిని చాటాలని తహసిల్దార్ తూము రవీందర్ పటేల్,అధికారులు కోరారు.



# అందరూ సమానులే..
# వివక్షకు తావులేదు

- ఆప్యాయతతో కలిసిమెలిసి జీవించినప్పుడే గ్రామాభివృద్ధి
- అంతర్గాం పౌర హక్కుల దినోత్సవంలో
- తహసీల్దార్ తూము రవీందర్ పటేల్

**రామగుండం,తెలంగాణ చౌరస్తా:**

"జాతి, కులం, మతం, లింగ భేదం లేకుండా సమాజంలో అందరూ సమానులే. ఎవరి పట్ల వివక్ష చూపినా చట్టపరమైన చర్యలు తప్పవు" అని అంతర్గాం తహసీల్దార్ తూము రవీందర్ పటేల్ స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని విలేజ్ అంతర్గాం గ్రామం, కాంపల్లి వాడలో నిర్వహించిన 'పౌర హక్కుల దినోత్సవం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కు, వాక్ స్వాతంత్రం, పీడనాన్ని నిరోధించే హక్కు, మత స్వేచ్ఛ వంటివన్నీ సమాజంలో సమతుల్యతను పెంపొందించడానికే అని తెలిపారు. షెడ్యూల్ కులాలు, తెగల ప్రజల పట్ల ఎవరైనా ద్వేషం లేదా వివక్ష ప్రదర్శిస్తే రాజ్యాంగం ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు.అందరూ



ఒకరినొకరు గౌరవించుకుంటూ, ఆప్యాయతతో కలిసిమెలిసి జీవించినప్పుడే గ్రామాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.ప్రజలతో మమేకమైన తహసీల్దార్కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ స్థానిక ప్రజలతో ఎంతో ఆప్యాయంగా గడిపారు. కాంపెల్లి లక్ష్మీ విన్నపం మేరకు ఆమె ఇంటికి వెళ్లి సమ్మక్క బంగారం (బెల్లం) స్వీకరించారు. అనంతరం కాంపెల్లి నర్సింగం నివాసంలో టీ తాగి, వారితో ముచ్చటించి తన సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఉన్నతాధికారి స్వయంగా తమ ఇళ్లకు రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రవికుమార్, మండల గిర్దావర్ 2 శ్రీమాన్, జూనియర్ సహాయకులు కె. శ్రీనివాస్, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అసమానతలు లేని సమాజం కోసం పాటుపడదాం

**కాల్వ శ్రీరాంపూర్,తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం పైన ప్రజలకు అవగాహన కల్పించారు. అస్పృశత, అసమానతలు లేని సమాజం కోసం పాటుపడదామన్నారు.ఇన్చార్జి జిపీవో శ్రీనివాస్,ఉపసర్పంచ్ పత్తి శ్రీనివాస్ రెడ్డి,వార్డ్ మెంబర్ సలిగంటి సరిత సదయ్య,వీఆర్ఏలు మర్రి కుమారస్వామి, చంద్రమౌళి,అంబేద్కర్ సంఘం నాయకులు, పాల్గొన్నారు.





# అశ్వారావుపేటలో 'హస్తం' హోరు

- భారీ ర్యాలీతో జూపల్లి రమేష్ నామినేషన్
- జూపల్లి పవర్‌కు నిదర్శనం
- వేలాదిగా తరలివచ్చిన జనప్రభంజనం
- ఇంత హంగామా అవసరమా.. బిఆర్ఎస్ నేతల గుసగుసలు



**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:**


అశ్వారావుపేట మున్సిపల్ ఎన్నికల బరిలో కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి రమేష్ తనదైన శైలిలో దూసుకుపోతున్నారు.నామినేషన్ పర్వం నుండే తన గెలుపు సంకేతాలను ప్రత్యర్థులకు రుచి చూపించారు. వందలాది వాహనాలు, వేలాది మంది కార్యకర్తలు, మద్దతుదారుల నడుమ ఒక భారీ జనసముద్రంలా కదిలి నామినేషన్ దాఖలు చేయడంతో నియోజకవర్గ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. గతంలో ఎన్నడూ చూడని విధంగా సాగిన ఈ హంగామా చూసి బిఆర్ఎస్ శ్రేణులు ఉలుక్కుపడుతున్నాయి. "నామినేషన్ కే ఇంత హంగామా అవసరమా?" అంటూ ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తున్నప్పటికీ, లోలోపల జూపల్లి సృష్టిస్తున్న ప్రభావంపట్ల ఆందోళన చెందుతున్నట్లు స్పష్టమవుతోంది.

**పగలు రేయి తేడా లేకుండా ఇంటింటి ప్రచారం..**

కేవలం భారీ ర్యాలీలకు పరిమితం కాకుండా, జూపల్లి రమేష్ క్షేత్రస్థాయిలో ఓటర్ల మనసు గెలుచుకుంటున్నారు.పగలు,రాత్రి అనే తేడా లేకుండా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. అశ్వారావుపేటలో మార్పు రావాలని, అది తనతోనే సాధ్యమని ఓటర్లలో ఒక గట్టి నమ్మకాన్ని కలిగించడంలో ఆయన విజయవంతమయ్యారు. సొంత నిధులతో ప్రజోపయోగ కార్యక్రమాలు చేపడుతూ, ఒక నాయకుడిగా తనకంటూ ఒక ప్రత్యేక 'మార్కు' క్రియేట్ చేసుకున్నారు.తరలివస్తున్న మద్దతుదారులు..యువత జైజైలుజూపల్లి రమేష్‌తిరుగుతున్న వార్డుల్లో ప్రజల స్పందన చూసి ప్రత్యర్థి వర్గాలు బెంబేలెత్తుతున్నాయి.అశ్వారావుపేట యువత పెద్ద ఎత్తున రమేష్ వెంట నడుస్తూ ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. అంతేకాకుండా, పలువురు మాజీ సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు కూడా రమేష్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటిస్తుండటం ఆయన గెలుపు అవకాశాలను మరింత సుగమం చేస్తోంది. మున్సిపల్ ఎన్నికల చరిత్రలో ఇంతటి క్రేజ్ సంపాదించుకున్న నాయకుడు గతంలో లేడని స్థానిక ఓటర్లు చర్చించుకుంటున్నారు.ఇదే జోరు కొనసాగితే అశ్వారావుపేటలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# గాంధీజీకి ఘన నివాళి

**తెలంగాణ చౌరస్తా, హైదరాబాద్:**



అహింసే ఆయుధమని, సత్యమే మార్గమని నమ్మి స్వాతంత్ర్యం సాధ్యమని ప్రపంచానికి చాటి చెప్పిన మహానుభావుడు మహాత్మా గాంధీ అని స్కై ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్. వై. సంజీవ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అహింసా మార్గంలో పోరాటం చేసి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అమూల్యమైన, అపూర్వమైన పాత్ర పోషించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని పాల్గొన్నారు.



## వరాల తల్లులకు తనివితీరా..
# తీరొక్క మొక్కులు..

- గద్దెలపై కొలువైన నలుగురు దేవుళ్లు
- సమ్మక్క సారలమ్మ ఆగమనంతో.. అడుగడుగునా భక్తుల నీరాజనాలు
- వనదేవతలకు మొక్కులు సమర్పించుకున్న భక్తకోటి జనం
- నేడు సమ్మక్క - సారలమ్మ దేవతల వనప్రవేశం
- వరాల తల్లుల ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలి
- ఎమ్మెల్యే సి.హెచ్ విజయ రమణారావు



**పెద్దపల్లి/సుల్తానాబాద్, తెలంగాణ చౌరస్తా :**

కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం అయినా సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుకు భక్తజనం తీరొక్క మొక్కులు చెల్లించారు. పెద్దపల్లి జిల్లాలోని పలు గ్రామాల్లో వెలసిన నలుగురు దేవుళ్లు గద్దెలపై కొలువు దీరడంతో భక్తులు తనివితీరా మొక్కులు అప్పజెప్పారు. తమ కోరికలు నెరవేరడంతో వనదేవతలకు ఒక్కో భక్తుడు.. ఒక్కోరకంగా మొక్కులు చెల్లించారు.

**వనదేవతలను దర్శించుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే..**

శుక్రవారం పెద్దపల్లి మండలంలోని హనుమంతుని పేట, తుర్కలమద్దికుంట, సుల్తానాబాద్ మండలంలోని నారాయణపూర్, గర్రెపల్లి, నీరుకుల్ల, తొగర్రాయి, కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి, మీర్జాంపేట, ఓదెల మండలంలోని కొలనూరు గ్రామాలలో సమ్మక్క సారలమ్మ జాతర మహోత్సవం సందర్భంగా గద్దెలపై కొలువుదీరిన వనదేవతలకు స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే సి.హెచ్ విజయ రమణారావు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అనంతరం అక్కడే కొలువైన పగిడిద్దరాజు, గోవిందరాజుకు కూడా దర్శించుకుని మొక్కులు అప్పజెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పెద్దపల్లి నియోజకవర్గంలోని ఎనిమిది చోట్ల సమ్మక్క సారలమ్మ వెలసిన గ్రామాల్లో భక్తుల సౌకర్యార్థం రూ. 8 కోట్ల నిధులతో తారు రోడ్ల నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇచ్చిన మాట నెరవేర్చడమే తప్ప.. మాట తప్పేది లేదని స్పష్టం చేశారు. సమ్మక్క సారలమ్మ జాతరకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా గ్రామాల్లో అధికారులు, జాతర కమిటీ సభ్యులు, పోలీసులు, వాలంటీర్లు మెరుగైన సౌకర్యాలు కల్పించారని అభినందించారు.

**అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పించిన ఎమ్మెల్యే విజయరమణారావు..**

సుల్తానాబాద్ మండలంలోని నీరుకుల్ల శ్రీ రంగనాయక స్వామి ఆలయ ప్రదేశం వద్ద మానేరు తీరాన వెలసిన శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్లకు నిలువెత్తు బంగారాన్ని ఎమ్మెల్యే విజయ రమణారావు సమర్పించారు. అనంతరం వనదేవతలను దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ అమ్మవార్ల ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలతో రైతులందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ చైర్మన్ లు, పలు గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్ లు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.





# కెసిఆర్‌పై సిట్ విచారణ కక్ష సాధింపు చర్యే

- కె.యూ బిఆర్ఎస్వీ నాయకులు

**కె.యూ క్యాంపస్, తెలంగాణ చౌరస్తా :**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పైనా సిట్ విచారణ దారుణం,ఇది ముమ్మాటికి కక్ష సాధింపు చర్యే అని కె.యూ బిఆర్ఎస్వీ నాయకులు, బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు డా. బొల్లికొండ వీరేందర్,బిఆర్ఎస్వీ సీనియర్ నాయకులు డా. కొమురయ్య, బిఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్ చంద్ర,కె.యూ ఇంచార్జీ డా.జట్టి రాజేందర్ అన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.... ప్రజా పాలన ప్రభుత్వం కాదు ప్రతీకార పాలన ప్రభుత్వమని,కెసిఆర్ పై సిట్ పేరుతో నోటీసులను పంపడం ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో రోజురోజుకు రేవంత్ సర్కార్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని, ఈ రేస్ పేరుతో కేటీఆర్ ను, ఫోన్ టాపింగ్ కేసులో కేటీఆర్ ని,హరీష్‌రావు ని,సంతోష్‌రావుని విచారించడంతోపాటు మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి తెలంగాణ సాధకుడు కేసీఆర్ పైనే సీట్ విచారణకు పూనుకోవడం దారుణమైన తప్పిదని అన్నారు.ప్రతి ఎలక్షన్ల ముందు ఏదో ఒక పేరుతో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వేధించడం ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూడడం అనాగరిక చర్య రేవంత్ రెడ్డి కచ్చా సాధింపు చర్యల్లో భాగంగా ఈ విచారణను చేస్తున్నాడని వెంటనే కేసీఆర్ పై విచారణను ఆపివేయాలని ఫోన్ టాపింగ్ ఏదైనా జరిగి ఉంటే అది ఇంటలిజెన్సీ లేదా ఇతర పోలీసు అధికారుల చర్యల్లో భాగంగా జరిగి ఉండవచ్చునని ప్రతి ప్రభుత్వం రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడడానికి కొంత సమాచారాన్ని సేకరించడానికి ఏవైనా ఎవరైనా బాధ్యులు అయి ఉంటే ఇదివరకే అధికారులను విచారించారని నిజంగా అందులో నిజం ఉంటే ఇప్పటికే చర్యలు తీసుకునే వారిని అని అన్నారు.కేవలం రాజకీయ సాధింపులో భాగంగా ఇటువంటి దుర్మార్గమైన విధానాలని పాటిస్తే భవిష్యత్తులో ఏ ముఖ్యమంత్రి అధికారంలో ఉండలేదని ఇకనైనా ఇటువంటి చర్యలను మానుకొని ప్రభుత్వాల్లోకి వచ్చినప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను గ్యారెంటీలను నెరవేర్చాలని ఆ దిశగా అభివృద్ధి దిశగా అడుగులు వేయకుండా నిత్యము ప్రతిపక్షంపై నోరు జారుతూ వేధింపులు చేస్తూ పోతుంటే తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరని ఇకనైనా వెంటనే సీట్ విచారణను కేసీఆర్ పై ఆపివేయాలని డిమాండ్ చేశారు.ఆరు గ్యారెంటీలు 420 హామీలను అమలు చేయడానికి చేతగాక విచారణ పేరుతో ప్రజల దృష్టిని మళ్లించడానికి ఈటువంటి దుర్మార్గమైన చర్యలకు పాల్పడడం సిగ్గుచేటు అని అన్నారు. తక్షణమే కేసీఆర్ కి ఇచ్చిన నోటీసులను వెనుకకు తీసుకోవాలని,లేనిపక్షంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో నాయకులు గాజ్జి విష్ణు, కోరాపెల్లి రాజేష్,రాము, రాజేష్,అనిల్,వేణు,ప్రవీణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు డ్యాగల రవీందర్ రిటైర్మెంట్

- సన్మానించిన యూనియన్ నేతలు
- శేష జీవితం సంతోషంగా గడపాలి
- తెలంగాణ వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు రాంబాబు యాదవ్

**పటాన్ చెరు,తెలంగాణ చౌరస్తా :**

తెలంగాణ వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డ్యాగల రవీందర్ ఈ నెల 31(శనివారం) ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు రాంబాబు యాదవ్ శుక్రవారం పటాన్ చెరు యూనియన్ కార్యాలయంలో రవీందర్ ను ఘనంగా సన్మానించారు.రాంబాబుఎంప్లాయిస్ పాటు యూనియన్ నాయకులు రవీందర్ రిటైర్మెంట్ సందర్భంగా ఆయనకు పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగికీ పదవి విరమణ సహజమే అని చెప్పారు. విరమణ కేవలం ఉద్యోగానికి మాత్రమే అని.. సేవకు కాదన్నారు. రిటైర్మెంట్ తర్వాత కార్మిక నేతగా కార్మికుల హక్కుల సాధనకు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. శేష జీవితం సంతోషాలతో గడపాలని ఆయన ఆకాంక్షించారు. రవీందర్ తన ఉద్యోగ నిర్వహణతో పాటు యూనియన్ కార్యకలాపాలలో చాలా చురుకుగా పాల్గొనేవాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మయ్య, అసోసియేట్ అధ్యక్షుడు మేడ్చల్ శ్రీనివాస్, యూనియన్ చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ జమీల్ అహ్మద్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ రాంచంద్రం రెడ్డి, కొకపేట జంగయ్య, వెంకటేష్ యాదవ్, ఉదయ్ కుమార్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ శివ రెడ్డి, సీనియర్ నాయకులు జగన్, నర్సింగ్ రావు, రాజేష్ ముదిరాజ్, సెక్రటరీ ప్రేమ్ కుమార్, యాదగిరి, గణేష్, యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.





# 19వ వార్డులో పాకలపాటి లక్ష్మి విస్తృత ప్రచారం

- బీఆర్ఎస్ మద్దతుతో సీపీఐ (ఎం) అభ్యర్థిగా ప్రచార హోరు

**సత్తుపల్లి,తెలంగాణ చౌరస్తా :**

19వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సీపీఐ(ఎం) అభ్యర్థి పాకలపాటి లక్ష్మి శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు.వార్డులోని పలు కాలనీలలో ఇంటింటి ప్రచారం చేస్తూ ప్రజలను నేరుగా కలుసుకుని తమ సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పాకలపాటి లక్ష్మి మాట్లాడుతూ.... ప్రజల మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు ,డ్రైనేజీ,రోడ్ల అభివృద్ధి,పేదల సంక్షేమం కోసం నిరంతరం పోరాడతానని హామీ ఇచ్చారు.బీఆర్ఎస్-సీపీఐ(ఎం) ఐక్యతతో ప్రజలకు న్యాయం చేసే పాలన అందిస్తామని తెలిపారు.ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్, సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు,మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థికి మద్దతు తెలిపారు.ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ తన విజయానికి నిదర్శనమని లక్ష్మి అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అమరవారపు కృష్ణారావు,చింతనిప్పు బాబురావు, శ్రావణ్,కంచర్ల నాగేశ్వరావు,నాగార్జున వెంకటాచారి,వెంకటేశ్వరావు,రాఘవేంద్రరావు,కొత్తపల్లి నరసరావు,సిపిఎం నాయకులు మొరంపొడి పాండురంగారావు,సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు,రావుల రాజబాబు, జాజిరి శ్రీనివాస్,పాకలపాటి మల్లికార్జున్,పాకలపాటి శ్రీనివాసరావు,రమేష్, భాస్కర్,పాకలపాటి ఝాన్సీ, సునీత తదితరులు పాల్గొన్నారు.



# వ్యాయామ పరీక్షల షెడ్యూల్ విడుదల

**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా :**

2026-2027 విద్యా సంవత్సరానికి 2 సంవత్సరాల బి.పి.ఇడి, డి.పి.ఇడి కోర్సులలో ప్రవేశం కోసం శాతవాహన విశ్వవిద్యాలయం,కరీంనగర్ వారిచే నిర్వహించబడుతున్న టిజి పిఇసెట్ 2026 పరీక్ష కమిటీ మొదటి సమావేశం ఈరోజు హైదరాబాద్‌లోని తెలంగాణ ఉన్నత విద్యా మండలి (టిజిసిహెచ్ఇ) కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది.ఈ సమావేశంలో టిజిసిహెచ్ఇ చైర్మన్ ఆచార్య వి. బాలకిష్టా రెడ్డి,శాతవాహన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్,టిజి పిఇసెట్ 2026 చైర్మన్ ఆచార్య యు. ఉమేష్ కుమార్,టిజిసిహెచ్ఇ వైస్ చైర్మన్1 ఆచార్య ఇ. పురుషోత్తం ,టిజిసిహెచ్ఇ వైస్ చైర్మన్II ఆచార్య షేక్ మహమూద్,టిజిసిహెచ్ఇ కార్యదర్శి ఆచార్య శ్రీరామ్ వెంకటేష్,టిజి పిఇసెట్ 2026 కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ పాల్గొన్నారు.టిజి పిఇసెట్ కమిటీ అర్హత ప్రమాణాలు,పరీక్షా విధానం, నిబంధనలు ,పరీక్షా షెడ్యూల్ మొదలైన వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించి,ఆమోదించింది.టిజి పిఇసెట్ 2026 షెడ్యూల్ క్రింది విధంగా ఉంది: టిజి పిఇసెట్ 2026 షెడ్యూల్ నోటిఫికేషన్ జారీ 25.02.2026,ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణ ప్రారంభం 02.03.2026,అపరాధ రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించడానికి చివరి తేదీ 05052026,వివిధ అపరాధ రుసుములతో ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించడానికి చివరి తేదీ: 20.05.2026,పరీక్ష తేదీలు (శారీరక సామర్థ్య,నైపుణ్య పరీక్షలు) 31052026 నుండి 03062026 వరకు వివరాల కోసం దయచేసి 25.02.2026 నుండి https://pecet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.



# మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ పరిశీలన

**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా:**

పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో చివరి రోజు జరుగుతున్న నామినేషన్ ప్రక్రియను ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్ పద్మజ రాణి,ఎక్స్పెండచర్ అబ్జర్వర్ సుజాత లు పరిశీలించారు.మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ పరిశీలించారు.వారి వెంట ఎన్నికల అధికారి,మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్,టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్,అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్,ఎన్నికల మాస్టర్ ట్రైనర్ కృష్ణ రెడ్డి, సి.ఐ ప్రవీణ్,ఎస్సై లక్ష్మణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# నైట్ డ్రెస్‌లో నన్ను చూడాలని అన్నాడు

సంక్రాంతికి వస్తున్నాం మూవీతో సూపర్ హిట్ కొట్టేసిన కోలీవుడ్ భామ ఐశ్వర్య రాజేశ్. గతేడాది సంక్రాంతికి రిలీజైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా హిట్‌గా నిలిచింది. ఈ చిత్రంలో విక్టరీ వెంకటేశ్ హీరోగా నటించారు. మీనాక్షి చౌదరి మరో హీరోయిన్‌గా మెప్పించింది. అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో వచ్చిన ఈ చిత్రం సంక్రాంతి సూపర్ హిట్‌గా నిలిచింది. బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. అయితే ఈ మూవీతో టాలీవుడ్‌లోనూ ఫేమ్ తెచ్చుకున్న బ్యూటీ ఐశ్వర్య రాజేశ్. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన ఐశ్వర్య ఆసక్తికర కామెంట్లే చేసింది. ప్రతి ఒక్క అమ్మాయి ఏదొక టైమ్‌లో ఇలాంటి పరిస్థితి ఎదుర్కొని ఉంటారని తెలిపింది. నైట్ అమ్మాయిలు కొంచెం సెక్సీగా ఉండే దుస్తులు వేసుకుంటారు కదా.. నువ్వు అలాగే వేసుకుంటే 'ఐ వాంట్ సీ యువర్ బాడీ'అని నాతో అన్నారని గుర్తు చేసుకుంది. అది చూసి ఇలా ఎంతమంది అమ్మాయిలని చేసుంటారని నాకు అనిపించిందని ఐశ్వర్య రాజేశ్ వెల్లడించింది. అయితే ఆ వ్యక్తి ఎవరనే విషయం మాత్రం వెల్లడించలేదు. అంతేకాకుండా మా నాన్నగారు నా చిన్నప్పుడే చనిపోయారంటూ ఎమోషనలైంది. డ్రెస్‌ల విషయంలో మనం సందర్భానికి తగినట్లుగా వేసుకోవడం మంచిదని ఐశ్వర్య రాజేశ్ అన్నారు.



Published and Managing Director by Gaddam Shyam on behalf Mithra Publications, Published at 1-9-1113/1/B, Street No. 11, Vidyanagar, Hyderabad, Telangana-500044.
Editor: GADDAM SHYAM, RNINO. TELTEL12241, tcnewsweb@gmail.com